veluturu telugu daily
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి నల్గొండ
సంపుటి : 9
మంగళవారం 13.10.2026
సంచిక : 121
www. veluturu.com

## వెదురు వస్తువులకు లక్ష గిరాకీ..
## సీతాఫలాలకు పోటాపోటీ..

ఆరవ రోజు అదుర్స్ అనిపించిన సరస్ మేళా

- విదేశీయులు, ప్రముఖుల సందర్శనతో సందడి
- కాశ్మీర్ కార్పెట్ల నుంచి కేరళ మసాలాల వరకు భారీ గిరాకీ

12



# కొత్త ఫారం-6ను ఆమోదించలేదు

## ఈసీ ప్రకటనపై సీజేఐ ఆగ్రహం

**బీ**హార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు అంశంలో కొత్త ఫామ్-6పై ఎలాంటి తీర్పు ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తీర్పు వెలువరించినప్పుడు కొత్త ఫారం-6 అంశమే లేదని తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఫామ్-6లో చేసిన మార్పులను అత్యున్నత న్యాయస్థానం ఆమోదించిందన్న ఈసీ చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామని పేర్కొంది.

- బిహార్ సర్ అంశం విచారణలో కొత్త ఫామ్-6ను ఆమోదించామన్న వాదన అబద్ధం
- ఆ విచారణలో అంశమే రాలేదన్న సుప్రీంకోర్టు
- బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించిన పిటిషన్‌పై విచారణ




**న్యూఢిల్లీ, వెలుతురు:**

**భా**రత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం సోమవారం బీహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఫామ్-6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, కొత్త ఫామ్-6పై ఎలాంటి న్యాయ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. బీహార్ ఎస్ఐఆర్ వ్యవహారంపై గతంలో విచారణ జరిపినప్పుడు కొత్త ఫామ్-6 అంశం తమ ముందుకు రాలేదని ఆయన పేర్కొన్నారు.

బీహార్ ఎస్ఐఆర్ అంశంలో మేలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఆ తీర్పులో ఫామ్-6ను ఎస్ఐఆర్ ధ్రువీకరణ ప్రక్రియకు మార్గదర్శకంగా పేర్కొంది. అప్పట్లో బిహార్లో ఉపయోగించిన ఫామ్-6 పత్రాల పరిశీలనకు ఒక విధానాన్ని నిర్దేశిస్తోందని వివరించింది. ధ్రువీకరణ ప్రక్రియకు ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా పూర్తిగా అధికారుల వ్యక్తిగత నిర్ణయాలపై వదిలేయడం ఆచరణ సాధ్యం కాదని, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం రూపొందించిన ఫామ్-6, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(2) కింద చేపట్టే ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియకు అనుగుణంగా ఉండాలని

## బీజేపీ మాత్రమే గెలిచేలా
## ఎన్నికల కమిషన్ అక్రమాలు

- ఓటు హక్కు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సత్యాగ్రహం
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మా పోరాటం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

12



## కేసీఆర్ బాటలోనే మోదీ

- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఎత్తేసిన కేసీఆర్‌కు పట్టిన గతే జంతర్‌మంతర్ వద్ద ఆంక్షలు విధించిన మోదీకి పడుతుంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2



## ఆర్థిక శాస్త్రంలో
# ఇద్దరికి నోబెల్

- స్థూల ఆర్థిక స్థిరత్వంపై పరిశోధనకు గుర్తింపు
- ఈ ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటనల్లో ఇదే చివరిది



**న్యూయార్క్, వెలుతురు :**

**ఆ**ర్థిక శాస్త్రంలో 2026 సంవత్సరానికి గాను ఇద్దరికి నోబెల్ బహుమతి వరించింది. అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్ఫోర్డ్‌కు నోబెల్ కమిటీ పురస్కారం ప్రకటించింది. స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు అనే అంశంపై వీరు చేసిన పరిశోధనలకు గుర్తింపు దక్కింది. సోమవారం స్టాక్‌హోమ్‌లో రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటనల్లో ఇదే చివరిది.

### ఆర్థిక స్థిరత్వానికి కొత్త నమూనాలు

ఏ దేశ ఆర్థిక వ్యవస్థలోనైనా వృద్ధి, మందగమనం సహజం. కొన్ని సందర్భాల్లో ఉత్పత్తి, వినియోగం పెరిగి ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయి. మరికొన్ని సందర్భాల్లో ద్రవ్యోల్బణం పెరగడం, పెట్టుబడులు తగ్గడం, నిరుద్యోగం అధికమవడం వంటి పరిణామాలు ఎదురవుతాయి. ఇలాంటి పరిస్థితులను నియంత్రించేందుకు ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు వివిధ ఆర్థిక విధానాలను అమలు చేస్తుంటాయి. అయితే, ఏ సమయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నది కీలకం. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేశారు. వారి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకోవడానికి, విధాన నిర్ణయాల ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి, వినియోగం వంటి అంశాల మధ్య సంబంధాలను మాత్రమే పరిశీలించకుండా, వ్యక్తులు, కుటుంబాలు, వ్యాపార సంస్థలు తీసుకునే నిర్ణయాలు మొత్తం ఆర్థిక వ్యవస్థపై ఎలా ప్రభావం చూపుతాయో వివరించేందుకు వీరి పరిశోధనలు దోహదపడ్డాయి. గతంలో ఆర్థిక వ్యవస్థలోని - మిగతా 2 లో..



## ఎస్ఐఆర్ పేరుతో ఓట్-చోరీకి మోడీ, షా, జ్ఞానేష్ కుట్ర

### ఇది మరో స్వాతంత్ర్య పోరాటం

- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- మైనారిటీ, దళిత, గిరిజన, పేదల ఓట్ల తొలగింపునకు యత్నం
- ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ నేతృత్వంలో తీవ్ర పోరు
- ఆయనతో కలసి కదం తొక్కాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం దిశానిర్దేశం

**దే**శ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు. - ఢిల్లీ, వెలుతురు - 2 లో..

# ఇండీ కూటమి మార్చ్ ఉద్రిక్తం

## 'చలో ఢిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీలో పోలీసులకు కాంగ్రెస్ శ్రేణులకు మధ్యతోపులాట

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ముక్తకంఠం
- పిటిషన్ దాఖలు చేసిన రాహుల్‌గాంధీ
- ఢిల్లీలోని ఆరు కీలక మెట్రో స్టేషన్ల మూసివేత




**న్యూఢిల్లీ, వెలుతురు:**

**సీ**ఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ విపక్ష ఇండియా కూటమి ఢిల్లీలో చేపట్టిన 'చలో ఢిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ తదితర అగ్రనేతల నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ నుంచి సుప్రీంకోర్టు వైపు సాగిన ఈ నిరసన ప్రదర్శనను భగవాన్ దాస్ రోడ్డు వద్ద పోలీసులు భారీ బారికేడ్లతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ ఏకంగా బారికేడ్ల పైకెక్కి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు కుమ్మక్కై యువతను అణచివేస్తున్నారని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులు, మహిళలపై ఉద్దేశపూర్వకంగానే దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోవైపు, సీజేఐ సూచన మేరకు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అధికారికంగా నమోదైంది. విపక్ష నేతలను నేరుగా కలిసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. ఈ వ్యవహారం ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, అధికారికంగా పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. అంతకుముందు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన నేతలు బస్సులో కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ బయలుదేరారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ర్యాలీ సాగే మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బారాఖంబా జంక్షన్ నుంచి మండి హౌస్ వరకు భద్రతా - మిగతా 2 లో..



## బస్సుల్లో దసరా రద్దీ

- ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా అదనపు బస్సు సర్వీసులు
- ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి
- అధికారులకు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాలు
- తొలి 3 రోజుల్లోనే కోటి నలభై లక్షల మంది ప్రయాణం

**హైదరాబాద్, వెలుతురు:**

**ద**సరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దసరా పండుగ రద్దీ నిర్వహణ మరియు అదనపు బస్సుల ఆపరేషన్లపై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి సోమవారం - మిగతా 2 లో..

## ఖమ్మానికి కలియుగ వైకుంఠ శోభ

- శ్రీవారి ఆలయానికి వైభవంగా భూమిపూజ.. శంకుస్థాపన
- కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని చాటాలి: త్రిదండి చిన్నజీయర్ స్వామి
- ఆలయ నిర్మాణానికి రూ.1.46 కోట్ల విరాళాల ప్రకటన

11





## నో ఫోకస్.. ఓన్లీ మామూళ్లే!

**రో**గుల ప్రాణాలు కాపాడాల్సిన దవాఖానలే దోపిడీ కేంద్రాలుగా మారుతున్నాయి. అనుమతు లు అంతంతే.. పడకలు మాత్రం వందల్లో! వసతులు అంతంత మాత్రం.. బిల్లులు మాత్రం కార్పొరేట్ స్థాయిలో!

- ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా గాలికి.. వసూళ్లకే పరిమితమైన డీఎంహెచ్‌వోల నిఘా విభాగం
- తనిఖీల పేరిట మొక్కుబడి హడావుడి.. తెరవెనుక నెలవారీ ముడుపుల పర్వం
- 20పడకల అనుమతితో 100 బెడ్ల దందా.. అపార్ట్‌మెంట్లలోనే మల్టీస్పెషాలిటీ బోర్డులు

2

## ఆర్టీసీ -మెట్రో కామన్ పాస్ ఛార్జీల పునఃపరిశీలన

- ప్రజల ఫిర్యాదుల నేపథ్యంలో ఛార్జీల సమీక్షకు ప్రభుత్వం నిర్ణయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం

2

# ఆమోదించలేదు..

(మొదటిపేజీ తరువాయి)

ఆ తీర్పులో పేర్కొన్నారు.

## ఎన్నికల సంఘం ప్రకటనపై చర్చ

2026 సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం ఒక ప్రకటనను విడుదల చేసింది. అందులో బిహార్ ఎస్ఐఆర్కు సంబంధించి 2026 మేలో ఇచ్చిన తీర్పులో ఫామ్-6లోని ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు పేర్కొంది. దాని ప్రకారం, కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తులు గతంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాల తో తమకు ఉన్న సంబంధాన్ని వివరించే అదనపు డిక్లరేషన్ను సమర్పించాల్సి వచ్చింది. దరఖాస్తుదారులు తాము, తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతలు గత ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాల్లో నమోదై ఉన్నారా? అనే వివరాలు వెల్లడించాలి. ఈ వివరాల ద్వారా పాత ఓటర్ల జాబితాలతో అనుసంధానాన్ని గుర్తించే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం తప్పనిసరి చేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేయకుండా ఫామ్-6 దరఖాస్తులను సమర్పించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ మార్పులపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై అక్టోబర్ 5న విచారణ సందర్భంగా కూడా ప్రధాన న్యాయమూర్తి ఈ అంశంపై స్పందించారు. వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం ఉపయోగిస్తున్న ఫామ్-6లో చేసిన మార్పులను తాము ఆమోదించలేదని తెలిపింది.

ఫామ్-6 అనేది 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల షెడ్యూల్లో పొందుపరిచిన చట్టబద్ధమైన పత్రం. ఇందులో మార్పులు చేయాలంటే తగిన చట్టపరమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పిటిషన్లో వాదించారు. ఏకపక్షంగా పరిపాలనా నిర్ణయాల ద్వారా ఇటువంటి మార్పులు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

# బస్సుల్లోదసరా రద్దీ..

(మొదటిపేజీ తరువాయి)

అధికారులతో జూమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగ వేళ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సర్వీసులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

ఈ దసరా పండుగ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ రికార్డు స్థాయిలో సర్వీసులను నడుపుతూ మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించింది. గత ఏడాది (2025) దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులను నడపగా... ఈ ఏడాది అక్టోబర్ 9, 10, 11 తేదీలలో గతంతో పోలిస్తే 495 బస్సులు అదనంగా, అంటే మొత్తం 1,417 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చారు...

అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా దసరా పండుగ వేళ మహిళలకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. గత ఏడాది దసరా సమయంలో రోజుకు సగటున రూ. 13.02 కోట్లు ఆదా కాగా, ఈ ఏడాది దసరా రద్దీ సమయంలో మహిళలు రోజుకు రూ. 13.73 కోట్ల మేర ఆదా చేసుకోగలిగారు.

పండుగ ముందు రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వంత ఊర్లకు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 15, 16, 17 తేదీల్లో కూడా రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడపాలని అధికారులను ఎండీ వై. నాగిరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్ రెగ్యులర్ మరియు ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ కోసం ఉఉఉ.్ౌఆత్ౌఅవఅ.ఱఅ వెబ్సైట్ను ఉపయోగించుకోవచ్చని, ఇతర వివరాలు మరియు ప్రయాణ సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని సూచించారు.

# ఇండీ కూటమి మార్చ్ ఉద్రిక్తం..

(మొదటిపేజీ తరువాయి)

బలగాలను భారీగా మోహరించి, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఢిల్లీలోని ఆరు కీలక మెట్రో స్టేషన్ల మూసివేత

మరోవైపు ఇండీ కూటమి ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక ప్రకటన చేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఢిల్లీలోని ఆరు కీలక మెట్రో స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను సాయంత్రం నాలుగు గంటల వరకు మూసివేస్తున్నట్లు వెల్లడించింది.

నిరసనలు జరిగే మార్గంలో ఉన్న జన్పథ్, మండి హౌస్, బారాఖంబా రోడ్, సెంట్రల్ సెక్రటేరియట్, రాజీవ్ చౌక్, పటేల్ చౌక్ మెట్రో స్టేషన్లలో ప్రయాణికులు బయటకు వెళ్లడానికి, లోపలికి రావడానికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్-చోరీకి మోడీ, షా, జ్ఞానేష్ కుట్ర

- ఇది మరో స్వాతంత్ర్య పోరాటం
- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- మైనారిటీ, దళిత, గిరిజన, పేదల ఓట్ల తొలగింపునకు యత్నం
- ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ నేతృత్వంలో తీవ్ర పోరు
- ఆయనతో కలిసి కదం తొక్కాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం దిశానిర్దేశం



ఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 12:

దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు. ఓటు బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సీఎం అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో లాలా లజపతిరాయ్, భగత్సింగ్, మహాత్మాగాంధీ, జవహర్లాల్ నెహ్రూ వంటి నాయకుల త్యాగాలు చిరస్మరణీయమని సీఎం రేవంత్రెడ్డి గుర్తు చేశారు. 'సైమన్ గో బ్యాక్' ఉద్యమ సమయంలో లాలా లజప తిరాయ్ లాఠీచార్జిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఎందరో నాయకుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఓటు అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అందించిందన్నారు. రాజరిక, కుటుంబ పాలనలకు ముగింపు పలికి ప్రజల చేతిలో అధికారం పెట్టడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషించిందని సీఎం తెలిపారు. పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించడం ద్వారా అంబేద్కర్ సమానత్వానికి బాటలు వేశారని సీఎం కొనియాడారు.

## గతంలో ఓటు హక్కు కల్పించేందుకు ఎస్ఐఆర్

గతంలోనూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తెలిపారు. 1950లో జవహర్లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు కల్పించారని సీఎం గుర్తు చేశారు. దేశ విభజన సమయంలో ప్రజలు ఎక్కడ స్థిరపడ్డారు? ఎవరు ఏ ప్రాంతానికి వెళ్లారు? అనే వివరాలను గుర్తించాల్సిన అవసరం కూడా అప్పట్లో ఏర్పడిందని పేర్కొన్నారు. తర్వాత ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్పేయి ప్రభుత్వాల కాలంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. అయితే, గతంలో ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన వారిని చేర్చడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారని అన్నారు. ఇప్పుడు మోదీ, అమిత్ షాల పాలనలో మాత్రం ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం మండిపడ్డారు.

## పారదర్శకత కోసమే నాడు ఎన్నికల సంఘంలో మార్పులు

గతంలో ఎన్నికల సంఘం ఒక్క కమిషనర్ నేతృత్వంలో పనిచేసేదని, అయితే, ఈ సంస్థలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రిగా పి.వి.నరసింహారావు ఉన్న సమయంలో ముగ్గురు కమిషనర్ల విధానాన్ని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు.

## దళితులు, గిరిజనులు, పేదల ఓట్లే లక్ష్యమా?

దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజల ఓటు హక్కులను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్రెడ్డి ఆరోపించారు. దేశ యువత ఓట్లను తొలగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని సీఎం మండిపడ్డారు. సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కులను తొలగించే యోచనలో ఉందని సీఎం విమర్శించారు. ఈ ప్రమాదాన్ని తొలుత గుర్తించి దేశ ప్రజల దృష్టికి తీసుకొచ్చింది రాహుల్ గాంధీయేనని సీఎం వెల్లడించారు.

## మోదీ, అమిత్ షాల మౌనం ఎందుకు?

జ్ఞానేశ్ కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోదీ, అమిత్ షాలు భావిస్తే, ఆయనను తొలగించాలనే డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్కు వారు ఎందుకు అండగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేపడితే ఎందుకు అడ్డుకుంటున్నారని, నిరసనలను ఎందుకు అణచివేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఢిల్లీలో భారీగా పోలీసులను ఎందుకు మోహరిస్తున్నారో వివరించాలన్నారు.

## జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతాయి?

2014లో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రి పదవికి పోటీ చేసిన సమయంలో దేశంలో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని రేవంత్రెడ్డి తెలిపారు. 2019లో ఈ సంఖ్య సుమారు 91 కోట్లకు, 2024 ఎన్నికల నాటికి సుమారు 97 కోట్లకు చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ తొలగించే ఓట్ల సంఖ్యను 20 కోట్లకు పెంచే కుట్ర ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో దేశ జనాభా ఎంత? ప్రస్తుతం ఎంత? అనే వివరాలను పరిశీలించాలన్నారు. జనాభా పెరుగుతున్నప్పుడు ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణమేంటని సీఎం ప్రశ్నించారు. జనాభా పెరిగితే ఓటర్ల సంఖ్య పెరగాలా? తగ్గాలా? అన్నది సాధారణ ప్రశ్నేనని, దీనికి ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఓటు ఉన్నవారు.. లేనివారంటూ రెండు వర్గాలా?

దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు హక్కు లేనివారనే రెండు వర్గాలను సృష్టించే పరిస్థితి ఏర్పడుతోందని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను శ్రీమంతులు, పేదలు అనే వర్గాలుగా విడదీసి, పేదల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆరోపించారు. సంపన్నులు బీజేపీకి మద్దతుగా ఉంటారని, పేదలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉంటారనే రాజకీయ లెక్కలతో ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఓటు హక్కును తొలగించడం ద్వారా కొన్ని వర్గాల ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు ప్రతి పౌరుడికీ అందాలని, పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు.

## రాహుల్ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం

ఆనాడు 'సైమన్ గో బ్యాక్' నినాదం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. ఇప్పుడు రాహుల్గాంధీ నేతృత్వంలో సాగుతున్న 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు, ఓటు హక్కును కాపాడేందుకు దోహదపడుతుందన్నారు. గాంధీ కుటుంబం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని, ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన రాహుల్గాంధీ 'ఓట్ చోరీ' ప్రచారం ద్వారా ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు పోరాటం చేస్తున్నారని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నో ఫోకస్.. ఓన్లీ మామూళ్లే!

- ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా గాలికి.. వసూళ్లకే పరిమితమైన డీఎంహెచ్వోల నిఘా విభాగం
- తనిఖీల పేరిట మొక్కుబడి హడావుడి.. తెరవెనుక నెలవారీ ముడుపుల పర్వం
- 20 పడకల అనుమతితో 100 బెడ్ల దందా.. అపార్ట్మెంట్లలోనే మల్టీస్పెషాలిటీ బోర్డులు
- ఫైర్ సేఫ్టీ, ఎస్టీపీలకు పాతర.. నకిలీ మెడికల్ షాపులతో రోగుల జేబులకు చిల్లు!



హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:

గ్రేటర్ హైదరాబాద్ సహా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలో ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్ల ఆగడాలు మితిమీరిపోతు న్నాయి. అనారోగ్యంతో వచ్చిన రోగికి సాంత్వన చేకూర్చి ప్రాణం నిలపాల్సిన వైద్యశాలలు.. కొందరు యాజమాన్యాల చేతుల్లో అడ్డగోలు దోపిడీ అడ్డాలుగా రూపాంతరం చెందాయి. నిబంధనలకు పాతరేస్తూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఈ దవాఖానలపై నిరంతరం నిఘా ఉంచి, ప్రజారోగ్యానికి రక్షణ కల్పించాల్సిన జిల్లా వైద్యారోగ్య శాఖ (డీఎంహెచ్వో) అధికారులు మాత్రం తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమాలను అరికట్టడంలో ఘోరంగా విఫలమైన అధికార యంత్రాంగం.. కేవలం వసూళ్లు, నెలవారీ మామూళ్లకే పరిమితమైందన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

## పర్మిషన్ 20 బెడ్లకే.. నడిపేది 100!

క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం ఒక ఆస్పత్రిని ఏర్పాటు చేయాలంటే బెడ్ల సంఖ్య, గదుల విస్తీర్ణం, వైద్య సిబ్బంది నిష్పత్తి, వెంటిలేషన్ వంటి అంశాలపై నిర్దిష్ట నిబంధనలున్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో జరుగుతున్న దందా విస్మయం కలిగిస్తోంది:

## బెడ్ల పెంపు మాయాజాలం:

దరఖాస్తు చేసుకునేటప్పుడు కేవలం 20 లేదా 30 పడకలకే టెంపరరీ అనుమతి తీసుకుంటారు. ఆ తర్వాత ఏకంగా 60 నుంచి 100 బెడ్లు వేసి ఇష్టారాజ్యంగా రోగులను అడ్మిట్ చేసుకుంటారు.

**ఇరుకు సముదాయాల్లో ఆస్పత్రులు:**
నివాస ప్రాంతాల్లోని సాధారణ అపార్ట్మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో నాలుగు గదులు అద్దెకు తీసుకుని మల్టీస్పెషాలిటీ బోర్డులు తగిలిస్తున్నారు. అత్యవసర సమయంలో స్ట్రెచర్పై రోగిని తీసుకెళ్లడానికి కూడా వీల్లేని ఇరుకు గదుల్లో ఐసీయూలు నడుపుతున్నారు.

**కార్పొరేట్ స్థాయిలో బిల్లుల మోత:**
వసతులు గ్రామస్థాయిలో ఉన్నా.. ఫీజులు మాత్రం కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా వసూలు చేస్తూ రోగుల కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు.

**భద్రతా ప్రమాణాలకు తిలోదకాలు:**
ఫైర్ సేఫ్టీ, ఎస్టీపీ శూన్యం.. భవన నిర్మాణ అనుమతులు (Commercial Building Permissions), సెట్బ్యాక్లు, పార్కింగ్ సదుపాయాలు లేకుండానే దవాఖానలు వెలుస్తున్నాయి.

**అగ్నిప్రమాదం జరిగితే అంతే సంగతులు:**
అగ్నిమాపక శాఖ (Fire NOC) నిబంధనలు ఇక్కడ మచ్చుకైనా కనిపించవు. స్మోక్ డిటెక్టర్లు, స్ప్రింక్లర్లు, అత్యవసర మార్గాలు (Emergency Exits) లేకపోవడంతో ఏదైనా చిన్న ప్రమాదం జరిగినా భారీ ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.

**బయో-మెడికల్ వ్యర్థాల ఇష్టారాజ్యం:**
ఆస్పత్రుల నుంచి వెలువడే ప్రమాదకర బయో మెడికల్ వ్యర్థాలు, కలుషిత నీటిని శుద్ధి చేసే సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీ) 90 శాతం ఆస్పత్రుల్లో లేవు. వీటిని నేరుగా సాధారణ మురుగు కాలువల్లోకి వదులుతూ చుట్టుపక్కల ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు.

## బోర్డులపై సూపర్ స్పెషలిస్టులు.. లోపల ఆర్ఎంపీల వైద్యం!

ప్రైవేట్ దవాఖానల ప్రవేశ ద్వారం వద్ద ప్రముఖ వైద్యుల డిగ్రీలు, పేర్లు భారీ అక్షరాలతో దర్శనమిస్తాయి. లోపల పరిశీలిస్తే వాస్తవం వేరుగా ఉంటుంది.

- కనీస అర్హత లేని ఆర్ఎంపీలు, శిక్షణ లేని నర్సింగ్ సిబ్బందితోనే వార్డులు, ఐసీయూలు నడిపిస్తున్నారు.
- అత్యవసర చికిత్సలు, సెలైన్లు ఎక్కించడం, సూదులు వేయడం కూడా అన్-క్వాలిఫైడ్ సిబ్బందే చేస్తున్నారు.
- రోగి పరిస్థితి విషమించగానే చేతులెత్తేసి పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.
- ఆస్పత్రుల మాటున 'లైసెన్స్ లేని' మెడికల్ షాపులు ప్రైవేట్ ఆస్పత్రుల్లోని మెడికల్ షాపులు రోగుల జేబులను గుల్ల చేసే కామధేనువులుగా మారాయి.
- అత్యధిక ఆస్పత్రుల్లోని ఫార్మసీలకు డ్రగ్ కంట్రోల్ విభాగం నుంచి లైసెన్సులు ఉండటం లేదు.
- అర్హత కలిగిన ఫార్మసిస్టులు లేకుండానే విచ్చలవిడిగా మందులు అమ్ముతున్నారు.
- బయట మార్కెట్లో డిస్కౌంట్తో దొరికే మందులను సైతం రోగులు కచ్చితంగా ఆస్పత్రిలోని షాపులోనే కొనాలంటూ యాజమాన్యాలు
- నిబంధనలు పెట్టి ఎమ్మార్పీ ధరలకే అంటగడుతున్నాయి. తనిఖీల పేరిట మొక్కుబడి హడావుడి.. తెరవెనుక మామూళ్ల పర్వం!
- ఈ దందాను అరికట్టాల్సిన డీఎంహెచ్వో కార్యాలయ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.
- ఎక్కడైనా రోగి మృతి చెంది బంధువులు ఆందోళనకు దిగినప్పుడు లేదా మీడియాలో వార్తలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు తనిఖీల పేరిట హడావుడి చేస్తారు.
- నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నా కంటితుడుపుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటారు.

## ఆ తర్వాత తెరవెనుక

'నెలవారీ ప్యాకేజీలు' కుదుర్చుకుని ఆ ఫైళ్లను శాశ్వతంగా తొక్కిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**ఇటీవల ఎల్బీనగర్లో..** గతంలో అనుమతులు రద్దయిన ఓ సెంటర్కు తిరిగి లైసెన్స్ ఇచ్చేందుకు ఏకంగా జిల్లా వైద్యాధికారి స్థాయి వ్యక్తే లక్షల్లో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం నగరంలో సాగుతున్న వసూళ్ల దందాకు నిదర్శనం.

**ఒకవేళ ఏదైనా ఆస్పత్రిని రద్దు చేసినా..**
యాజమాన్యాలు బోర్డు పేరు మార్చుకుని మళ్లీ యథావిధిగా దందాను కొనసాగిస్తున్నాయి.

**ప్రజారోగ్య రక్షణేది? ఇప్పటికైనా మేల్కొనాలి!**
లాభార్జనే ధ్యేయంగా నడుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలను కట్టడి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి:

**స్పెషల్ టాస్క్ఫోర్స్ తనిఖీలు:** కేవలం స్థానిక వైద్యాధికారులకే పరిమితం చేయకుండా విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.

**బెడ్ల సంఖ్యపై ఆడిట్:** క్షేత్రస్థాయిలో ఉన్న బెడ్ల సంఖ్య, మంజూరైన పర్మిషన్లను లెక్కగట్టి అదనపు బెడ్లను తొలగించాలి.

**కఠినమైన సీజింగ్ చర్యలు:**
ఫైర్ సేఫ్టీ, ఎస్టీపీ, కమర్షియల్ భవన అనుమతులు లేని దవాఖానలను వెంటనే సీజ్ చేయాలి.

**అవినీతి అధికారులపై చర్యలు:** మామూళ్లకు అలవాటుపడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులను గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగించాలి.

# కేసీఆర్ బాటలోనే మోదీ

- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఎత్తేసిన కేసీఆర్కు పట్టిన గతే.
- జంతర్మంతర్ వద్ద ఆంక్షలు విధించిన మోదీకి పడుతుంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, ప్రతి రాజకీయ పార్టీకి రాజ్యాంగం కల్పించిన హక్కు అని రాష్ట్ర మంత్రి పొంగులే టి శ్రీనివాస్రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఒక వేదికగా ఉండేదని మంత్రి గుర్తు చేశారు. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజల నిరసన హక్కును కాలరాస్తూ ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ను ఎత్తివేసిందని విమర్శించారు. తమ నిరసన తెలిపే అవకాశం లేకుండా చేసిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని మంత్రిగారి పేర్కొన్నారు.

## కేసీఆర్ బాటలో మోదీ..

తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన అదే విధానాన్ని ఇప్పుడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని మంత్రి పొంగులేటి విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు చారిత్రకంగా ఉపయోగించుకున్న జంతర్మంతర్ వంటి నిరసన వేదికలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. కేసీఆర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో నిరసన వేదికను తొలగిస్తే.. మోదీ ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు ఆంక్షలు విధిస్తోందని, ఇద్దరి ఆలోచనా విధానం ఒక్కటేనని మంత్రి మండిపడ్డారు.

ప్రజల సమస్యలను వినకుండా, ప్రతిపక్షాల గొంతును వినిపించకుండా, నిరసనలకు వేదిక లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రజల గొంతును అణచివేయాలని చూసిన కేసీఆర్కు ఎలాంటి రాజకీయ పరిణామం ఎదురైందో.. అదే పరిస్థితి భవిష్యత్లో నరేంద్ర మోదీకి కూడా ఎదురవుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# ఆర్టీసీ -మెట్రో కామన్ పాస్ ఛార్జీల పునఃపరిశీలన

- ప్రజల ఫిర్యాదుల నేపథ్యంలో ఛార్జీల సమీక్షకు ప్రభుత్వం నిర్ణయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:



ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్నామని వెల్లడించారు.

ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్కు రూ.400 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉంది. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు.

అయితే ఈ ఛార్జీలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఛార్జీలను పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ధరలను నిర్ణయించే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రజా రవాణాను మరింత అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్..

(మొదటిపేజీ తరువాయి) వివిధ అంశాల మధ్య కనిపించే గణాంక సంబంధాల ఆధారంగా అనేక నమూనాలను రూపొందించేవారు. అయితే హాల్, వుడ్ఫోర్డ్ వ్యక్తిగత ఆర్థిక నిర్ణయాలకు ప్రాధాన్యం ఇచ్చే సూక్ష్మ ఆర్థిక సూత్రాల ఆధారంగా స్థూల ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేశారు. దీంతో ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులను వివరించడంతోపాటు, వాటిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను మరింత మెరుగ్గా అంచనా వేసే అవకాశం ఏర్పడింది. ఆ పరిశోధనల ఫలితంగా అభివృద్ధి చెందిన న్యూ కీనేసియన్ ఆర్థిక నమూనాలు ప్రస్తుతం కీలకంగా మారాయి. ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఏర్పడినప్పుడు దాన్ని అధిగమించేందుకు, ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు దాన్ని అదుపు చేసేందుకు ఎలాంటి విధానాలు అవసరమో విశ్లేషించడంలో ఇవి సహాయపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల కేంద్ర బ్యాంకులు, ఆర్థిక మంత్రిత్వ శాఖలు ఇటువంటి నమూనాలను ఉపయోగిస్తున్నాయి. పన్నులు, ప్రభుత్వ వ్యయం వంటి అంశాల్లో మార్పుల వల్ల ఆర్థిక కార్యకలాపాలను ప్రభావితం చేయగలవు. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు, ద్రవ్య సరఫరా వంటి అంశాల ద్వారా ఆర్థిక వ్యవస్థలో మార్పులకు ప్రయత్నిస్తాయి.

# ఉస్మానియాలో వైద్య సేవలకు వెంటిలేటర్

- ఆరోగ్యశ్రీ బకాయిలతో నిలిచిన వైద్యం
- మౌలిక సదుపాయాల లేమితో రోగుల అవస్థలు
- ఎక్స్‌రే నుంచి ఎంఆర్ఐ వరకు సమస్యలే..
- నాలుగేళ్లుగా గుండె శస్త్రచికిత్సలు లేవంటున్న జూనియర్ వైద్యులు
- సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తాం







**హైదరాబాద్, అక్టోబరు 12 (వెలుతురు) :** పేదల పాలిట పెద్ద దిక్కుగా నిలవాల్సిన ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య సేవలు మౌలిక సదుపాయాల కొరతతో సతమతమవుతున్నాయని జూనియర్ వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, అత్యవసర మందులు, శస్త్రచికిత్స పరికరాలు అందుబాటులో లేకపోవడం, వైద్య పరీక్షలకు ఆటంకాలు ఎదురవుతుండటంతో రోగులకు సకాలంలో చికిత్స అందడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడంతో సోమవారం నుంచి ఆందోళన కు దిగారు. తొలిదశలో ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలను నిలిపివేసినట్లు ప్రకటించారు. అత్యవసర సేవలకు మాత్రం అంతరాయం కలగకుండా కొనసాగిస్తున్నా మని స్పష్టం చేశారు.

**నిధుల కొరతతో నిలిచిన పరికరాలు**

ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోవడంతో రోగులకు అవసరమైన వైద్య సామగ్రి, శస్త్రచికిత్స పరికరాల సరఫరాపై ప్రభావం పడుతోందని జూనియర్ వైద్యులు పేర్కొన్నారు. ఆర్థోపెడిక్స్ విభాగంలో ఎక్స్‌రే యంత్రం తరచూ మొరాయిస్తోందని, ఎముకల విరుగుళ్లకు కట్లు కట్టేందుకు అవసరమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆ విభాగానికి చెందిన డాక్టర్ నాజియా తెలిపారు. కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు అవసరమైన ఇంప్లాంట్లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద రోగులకు వైద్యం అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మందులు సైతం ఆసుపత్రిలో లభించక బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని వివరించారు.

**ఎంఆర్ఐ కోసం పది రోజుల నిరీక్షణ**

న్యూరాలజీ విభాగంలో ఎంఆర్ఐ పరీక్షల కొరత రోగుల నిర్ధారణ, చికిత్సకు అడ్డంకిగా మారిందని వైద్యులు చెబుతున్నారు. రోజుకు 50 నుంచి 100 మంది వరకు ఎంఆర్ఐ పరీక్షల కోసం వస్తుండగా, ప్రస్తుతం రోజుకు సుమారు 20 పరీక్షలే నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. అత్యవసర రోగులకు సైతం పరీక్ష కోసం పది రోజుల వరకు గడువు ఇస్తున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. యంత్రం పనిచేయకపోవడంతో గత వారం రోజులుగా పరీక్షలు నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర పరీక్షల కోసం ఆరోగ్యశ్రీ



పరిధిలోని ప్రైవేటు డయాగ్నస్టిక్ కేంద్రాలతో అనుసంధానం చేయాలని కోరారు. అలా చేస్తే రోగులకు ఒకటి, రెండు రోజుల్లోనే పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంటుందని సూచించారు.

**నాలుగేళ్లుగా గుండె శస్త్రచికిత్సలు లేవు**

కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో గత నాలుగేళ్లుగా ఒక్క గుండె శస్త్రచికిత్స కూడా జరగలేదని అక్కడి జూనియర్ వైద్యుడు ఆరోపించారు. బైపాస్ యంత్రం, పర్ఫ్యూషనిస్ట్, పడక పక్కన ఎక్స్‌రే యంత్రం, ద్విమితీయ ఎకో యంత్రం, ఐసీయూ, అత్యవసర పర్యవేక్షణ పరికరాలు అందుబాటులో లేవని వివరించారు. శస్త్రచికిత్స గదుల్లో నీటి సరఫరా కూడా సక్రమంగా లేదని, బకెట్లతో నీటిని నింపుకోవాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ నిధులు అందకపోవడంతో కార్డియాలజీ విభాగంలో యాంజియోగ్రామ్, స్టెంటింగ్, పీటీసీఏ వంటి చికిత్సలు కూడా దాదాపు మూడు నెలలుగా నిలిచిపోయాయని ఆరోపించారు. నెలకు సుమారు వంద మంది గుండె సంబంధిత రోగులు వస్తున్నప్పటికీ అవసరమైన సదుపాయాలు లేక నిమ్స్, గాంధీ ఆసుపత్రులకు పంపించాల్సి వస్తోందన్నారు.

**మందులున్నాయా? పరీక్షలున్నాయా?**

రోగికి అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉండటం లేదని, వైద్యులు పది రకాల మందులు రాస్తే రెండు, మూడు మాత్రమే ఇచ్చే పరిస్థితి నెలకొందని జూనియర్ వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రక్తహీనతకు కారణాలు గుర్తించేందుకు అవసరమైన ప్రాథమిక రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షలు సకాలంలో జరగకపోవడంతో చికిత్సలో జాప్యం జరుగుతోందన్నారు. అత్యవసర శస్త్రచికిత్సలకు అవసరమైన కుట్లు వేసే సామగ్రి, గాయాలకు కట్లు కట్టే వస్తువులు, ఇతర పరికరాలు సక్రమంగా లేవని సర్జరీ విభాగం వైద్యులు తెలిపారు. పరీక్షలు, మందుల కోసం పేద రోగులు బయట డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు.

**వైద్యులకూ కనీస వసతులు కరవు**

ఆసుపత్రిలో పనిచేస్తున్న జూనియర్ వైద్యులకు సైతం కనీస సౌకర్యాలు లేవని ఆందోళనకారులు తెలిపారు. తాగునీరు, విశ్రాంతి గదులు, పడకలు, ఫ్యాన్లు వంటి సదుపాయాలు కొరవడ్డాయని, దోమల సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. 24 గంటలతో పాటు కొన్ని సందర్భాల్లో 48 గంటలపాటు విధులు నిర్వహించాల్సి వస్తున్నా విశ్రాంతి తీసుకునేందుకు అనుకూల పరిస్థితులు లేవన్నారు. మరోవైపు గత రెండు, మూడు నెలలుగా ఉపకార వేతనాలు సకాలంలో అందడం లేదని, ఆలస్యంగా విడుదల కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఉపకార వేతనాలను క్రమం తప్పకుండా విడుదల చేయడంతో పాటు కనీసం 40 శాతం పెంచాలని డిమాండ్ చేశారు.

**హామీ వచ్చే వరకు పోరాటం**

ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే విడుదల చేయడం, అత్యవసర మందులు, వైద్య పరీక్షల సామగ్రిని అందుబాటులో ఉంచడం, శస్త్రచికిత్స పరికరాలను సమకూర్చడం, ఎంఆర్ఐ సేవలను మెరుగుపరచడం, గుండె వైద్య విభాగాన్ని పూర్తిస్థాయిలో పనిచేయించేలా చర్యలు తీసుకోవడం వంటి డిమాండ్లను జూనియర్ వైద్యులు ముందుంచారు. సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని ప్రకటించారు. పేద రోగులకు మెరుగైన వైద్యం అందాలంటే ఉస్మానియా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను తక్షణమే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

---

ప్రజాస్వామ్యానికి

# సమాచార హక్కు వెన్నెముక

- అవినీతికి అడ్డుకట్ట.. పాలనలో పారదర్శకతకు బాట
- ప్రజలకు జవాబుదారీగా ప్రభుత్వ వ్యవస్థలు ఉండాలి : డా. బొమ్మరబోయిన కేశవులు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:** ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా. బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ తెలిపారు. సమాచారం చెప్పడం ప్రభుత్వ వ్యవస్థల బాధ్యత అని తెలిపారు. సమాచార హక్కు చట్టం-2005 ఇరవై ఒకటవ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చుని చెప్పారు. పాలనలో పారదర్శకతకు ఈ చట్టం దోహదపడుతుందని, ప్రజల సొమ్ము ప్రజల కోసమే అని తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి భయపడే పరిస్థితి కాకుండా, ప్రభుత్వ వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండే పరిస్థితి ఏర్పడాలన్నారు. 2005 అక్టోబర్ 12వ తేదీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ముఖ్యమైన రోజు అని , సమాచార హక్కు చట్టం అమలు లోకి వచ్చిన రోజు అని వివరించారు. ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకతను పెంచడం, అధికారుల్లో జవాబుదారీ తనాన్ని బలోపేతం చేయడం ముఖ ఉద్దేశ్యంతో ఈ చట్టం తెచ్చారని తెలిపారు. ఈ చట్టం రాక ముందు మన దరఖాస్తు ఎక్కడ ఉంది, ఫలానా పథకానికి ఎన్ని నిధులు వచ్చాయి, ఒక పనికి ఎన్ని నిధులు ఖర్చు చేశారు వంటి ప్రశ్నలకు సమాధానాలు పొందడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డారని వివరించారు. ప్రజాస్వామ్యం అంటే పౌరుడి గొంతుకు విలువ ఉండడం అని చెప్పారు. భారత రాజ్యాంగం మనకు ప్రజాస్వామ్య వ్యవస్థను అందించిందని, దానిని మరింత అర్థవంతం గా మార్చుకోవడానికి సమాచార హక్కు చట్టం శక్తి వంతమైన మార్గం అని వివరించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేసారు. సమాచార హక్కు చట్టం అంటే ప్రభుత్వ ప్రజా అధికార వ్యవస్థల వద్ద ఉన్న సమాచారాన్ని చట్ట ప్రకారం పొందే హక్కు అని తెలిపారు. సమాచార హక్కు చట్టం అనేది అధికారుల ను ఇబ్బంది పెట్టే ఆయుధం కాదని, ప్రజా వ్యవస్థలను బాధ్యతాయుతంగా పనిచేయించే ప్రజాస్వామ్య సాధనం అని వివరించారు. మన ఉద్దేశం ప్రజా ప్రయో జనానికి అనుగుణంగా ఉండాలనీ, మనకు వచ్చిన సమాచారాన్ని బాధ్యతతో ఉపయోగించాలనీ వివరిం చారు. ప్రతి పౌరుడు సమాచార హక్కును తెలుసుకో వాలి. ప్రతి విద్యార్థి ఈ చట్టం గురించి చదవాలి. ప్రతి సామాజిక సంస్థ ప్రజల్లో అవగాహన కల్పించాలి. అవినీతి అనేది ఒక వ్యక్తికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. అది సమాజ అభివృద్ధిని దెబ్బతీసే సమస్య అని చెప్పారు. మన లక్ష్యం వ్యక్తులను కించపరచడం కాదని, వ్యవస్థలో తప్పులు ఉంటే వాటిని సరిచేయడం. మన పోరాటం వ్యక్తులపై ద్వేషంతో కాదు.. అవినీతి, అక్రమాలు, జవాబుదారీతనం లేని పాలనపై ఉండాలి. అవినీతిని అరికట్టడానికి ప్రజల చైతన్యం అవసరం అని సూచించారు. ప్రజల చైతన్యానికి సమాచారం అవసరం అని, సమాచారాన్ని బాధ్యతతో వినియోగించడానికి చట్టంపై అవగాహన అవసరం అని తెలిపారు. ప్రజాస్వామ్యం అనేది కేవలం పార్లమెంటులోనో, శాసనసభలోనో ఉండేది కాదనీ, మన వ్యవస్థలో ఉంటుందన్నారు. సమాచార హక్కు అనేది ప్రజల చేతిలో ఉన్న ఒక ప్రజాస్వామ్య సాధనం. సమాచారం కోసం అడిగే పౌరుడిని గౌరవించే సమాజం కావాలి. నిజాయితీగా పనిచేసే అధికారులను గౌరవించే సంస్కృతి రావాలి. తప్పు జరిగినప్పుడు ఆధారాలతో ప్రశ్నించే ధైర్యం కావాలి. తప్పును సరిదిద్దుకునే వ్యవస్థలు కావాలి అని చెప్పారు. ప్రజల సొమ్ముకు లెక్క చెప్పే వ్యవస్థ రావాలని, ప్రజల హక్కులను గౌరవించే సమాజం కావాలన్నారు. దీని కోసం మన మందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ వెబ్ సైట్ ను ప్రారంభించారు. డీన్ తో పాటు సమాచార హక్కు చట్టంపై రూపొందించిన పుస్తకాలను, కరపత్రం ను ఆవిష్కరించారు.

---

వేసవిని తలపిస్తున్న

# అక్టోబర్ ఎండలు

అప్పటి వరకు ఇంతే, తాజా అలర్ట్స్..!!



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 11:** వాతావరణంలో భిన్న మార్పులు కనిపిస్తున్నాయి. రెండో వేసవి తరహా పరిస్థితులు నెలకొన్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాత్రి వేళల్లో కూడా ఉక్కపోత ప్రజలను కష్టాల్లో నెట్టేస్తోంది. గాలిలో తేమ శాతం తగ్గడంతో వేడి తీవ్రత మరింత పెరిగింది. ఈ పరిస్థితి ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితులు ఎప్పటి వరకు కొనసాగుతాయనేది వాతావరణ శాఖ నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగి నిప్పుల కొలిమిలా మారాయి. ప్రధానంగా ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి, ఇది ప్రజలను కలవరపెడుతోంది. శుక్ర, శనివారాల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా మూడు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో తేమ శాతం 60 నుంచి 70 శాతం మధ్య ఉండాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువగా నమోదవుతోంది. మైదాన ప్రాంతాల్లో గాలి కాలుష్యం వల్ల వేడి పెరిగినట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం గాలిలో తేమ శాతం 49 శాతానికి పడిపోయింది, ఇది వేడి తీవ్రతను సూచిస్తుందని చెబుతున్నారు. ూశ్రీంశీ =ఖుః తిరుమలలో ముదురుతున్న కర్ణాటక సత్రాల వివాదం - అంగీకరించేది లేదు..!! వాతావరణ శాఖ తాజా హెచ్చరికలు అదే విధంగా రామగుండంలో 42, హనుమకొండలో 49, మహబూబ్‌నగర్‌లో 51, నిజామాబాద్‌లో 45, నల్గొండలో 45 శాతం తేమ నమోదైంది.

రానున్న మూడు రోజుల్లో పెద్దపల్లి, ఖమ్మం, మంచిర్యాల, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్, ములుగు, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జగిత్యాల, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేయడం జరిగింది. మరోవైపు, నైరుతి రుతుపవనాలు ఒకటి, రెండు రోజుల్లో తెలంగాణపై నుంచి పూర్తిగా నిష్క్రమించనున్నాయి. రానున్న మూడు రోజుల్లో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

---

పీఎం-సేతు పరిధిలో సూరత్, విశాఖపట్నం క్లస్టర్ల కోసం

# షేర్‌హోల్డర్ అగ్రిమెంట్లపై సంతకాలు

- తొమ్మిది ప్రభుత్వ ఐటీఐలను మెరుగుపరిచేందుకు రూ.440 కోట్లకు ఆమోదం
- పీఎం--సేతు పరిధిలో ఐటీఐల్లో పరిశ్రమ ఆధారిత మార్పులను తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పనిచేస్తున్న ఏఎం/ఎన్ఎస్ ఇండియా



**ఢిల్లీ, పిఐబీ వెలుతురు అక్టోబర్ 12:** భారతదేశ ఐటీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా)తో భాగస్వామ్యం ద్వారా గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఐటీఐలను మెరుగుపరిచేందుకు ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయిబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్ (పీఎం--సేతు) పథకం పరిధిలో షేర్ హోల్డర్స్ అగ్రిమెంట్లపై (ఎస్‌హెచ్ఏలు) సంతకాలు పూర్తయ్యాయి. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ (డీజీటీ), గుజరాత్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు, ఏఎం/ఎన్ఎస్ ఇండియా మధ్య ఈ ఒప్పందాలు కుదిరాయి. ఇవి నిర్దేశించిన రెండు క్లస్టర్ల కోసం ఆ రెండు రాష్ట్రాల్లో ఆమోదించిన వ్యూహాత్మక పెట్టుబడి పథకాల (ఎస్ఐపీ) అమలుకు మార్గం సుగమం చేశాయి. గుజరాత్‌లోని సూరత్‌లో అయిదు ప్రభుత్వ ఐటీఐలతో కూడిన క్లస్టర్, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నాలుగు ప్రభుత్వ ఐటీఐలతో కూడిన మరో క్లస్టర్‌కు ఈ ఒప్పందం వర్తిస్తుంది. ఇది పీఎం--సేతు అమల్లో మరో ముఖ్యమైన ఘట్టాన్ని సూచిస్తుంది. బలమైన పారిశ్రామిక భాగస్వామ్యం, అంతర్జాతీయ స్థాయి శిక్షణ వసతుల ద్వారా భారతదేశ ఐటీఐ వ్యవస్థను మార్చడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఆమోదించిన ప్రాజెక్టులను అమలు చేయడానికి పారిశ్రామిక భాగస్వామి, కేంద్రం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేసేందుకు అవసరమైన విధివిధానాలు ఎస్‌హెచ్ఏలపై సంతకాల చేయడం ద్వారా అధికారికంగా ఏర్పాటయ్యాయి. ఐటీఐ క్లస్టర్లను మెరుగుపరచడానికి, కార్యకలాపాలను నిర్వహించడానికి అవసరమైన ప్రత్యేకమైన స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్పీవీలు) ఇప్పుడు ఏర్పాటవుతాయి. వీటిలో ఏఎం/ఎన్ఎస్ ఇండియాకు 51 శాతం వాటా ఉంటుంది. భారత ప్రభుత్వానికి, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి 24.5 శాతం చొప్పున భాగస్వామ్యం ఉంటుంది. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీమతి దేబశ్రీ ముఖర్జీ ప్రసంగించారు. "ఈ ఒప్పందాలపై సంతకాలు చేయడం మాత్రమే మన తుది లక్ష్యం కాదు. మన ఐటీఐల పరివర్తనాత్మక ప్రయాణానికి ఇదే ఆరంభం. ఇటీవల షాంఘైలో జరిగిన వరల్డ్ స్కిల్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన తొలి పది దేశాల్లో భారత్ చోటు దక్కించుకుంది. ఈ నేపథ్యంలో వరల్డ్ స్కిల్స్ భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే కేంద్రాలుగా పీఎం--సేతు సంస్థలు, ఆకాంక్షాత్మక సంస్థలు ఎదగాలని ఆశిద్దాం. మౌలిక వసతులను మెరుగుపరచడమే కాకుండా నైపుణ్య రంగంలో ఆకాంక్షలను, నాణ్యతను, ఫలితాలను మెరుగుపరచడమే మన లక్ష్యం కావాలి" అన్నారు.

**భవిష్యత్తు అవసరాలకు తగిన నైపుణ్యాల కోసం పారిశ్రామిక--విద్యాసంస్థల సహకారం**

తన విద్య, సాంకేతిక భాగస్వామి అయిన న్యూ ఏజ్ మేకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్) సహకారంతో ఈ ప్రాజెక్టును ఏఎం/ఎన్ఎస్ ఇండియా అమలు చేస్తుంది. తయారీ నైపుణ్యానికి, పారిశ్రామిక అంశాలకు సంబంధించిన సహకారాన్ని ఏఎం/ఎన్ఎస్ అందిస్తుంది. పాఠ్యాంశాల విస్తరణ, శిక్షణ పరమైన సంస్కరణలు, బోధనా సిబ్బంది నైపుణ్యాల అభివృద్ధి, విద్యాపరమైన ఆవిష్కరణలకు నామ్‌టెక్ సహకారం అందిస్తుంది.

**ప్రణాళికాబద్ధమైన చర్యలు:** శిక్షణ వసతులు, వర్క్‌షాపులు, ప్రయోగశాలల ఆధునికీకరణ అత్యాధునికమైన, పారిశ్రామిక అవసరాలకు తగిన విభాగాలను, సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టడం అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఇప్పటికే ఉన్న పాఠ్యాంశాలను మెరుగుపరచడం బోధకుల శిక్షణ, సామర్థ్య నిర్మాణాన్ని బలోపేతం చేయడం అభ్యర్థులకు ప్రత్యక్ష, ప్రయోగాత్మక శిక్షణావకాశాలను విస్తరించడం. ఐటీఐ పట్టభద్రుల్లో శిక్షణ నాణ్యతను, ఉపాధి అవకాశాలను, పరిశ్రమ అవసరాలకు తగిన సన్నద్ధతను ఈ చర్యలు మెరుగుపరుస్తాయని అంచనా వేస్తున్నారు.

**పీఎం--సేతు పరిధిలో ప్రధాన పరిశ్రమ ఒప్పందం**

సూరత్, విశాఖపట్నం క్లస్టర్లు రెండింటికీ కలిపి రూ.440 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. దీనిలో సూరత్ క్లస్టర్‌కు రూ.240 కోట్లు, విశాఖపట్నం క్లస్టర్‌కు రూ.200 కోట్లను కేటాయించారు. ఇప్పటి వరకు పీఎం--సేతు పథకం పరిధిలో ఆమోదం పొందిన అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడి హామీల్లో ఏఎం/ఎన్ఎస్ ఇండియా నేతృత్వంలోని ప్రాజెక్టులు ఒకటిగా నిలుస్తున్నాయి. ఈ పథకం పరిధిలోని తొలి 14 వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళిక (ఎస్ఐపీ)ల్లో ప్రతిపాదించిన మొత్తం పెట్టుబడి రూ.3,446 కోట్లకు ఆమోదం లభించింది.

పీఎం--సేతు గురించి మొత్తం రూ.60,000 కోట్ల పెట్టుబడితో భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పీఎం--సేతు పథకాన్ని అమలు చేస్తోంది. బలమైన పారిశ్రామిక భాగస్వామ్యాలు, సంస్థాగత సంస్కరణల ద్వారా దేశ వృత్తి విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడమే ఈ పథకం లక్ష్యం. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను మెరుగుపరుస్తారు. అయిదు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్టీఐ)లను బలోపేతం చేస్తారు.

---

# విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్ల నిధులు

- మంత్రి సీతక్క విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీచేసిన విద్యుత్ శాఖ

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:** ములుగు నియోజకవర్గ ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి సీతక్క చేసిన విజ్ఞప్తికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. నివాస ప్రాంతాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లను మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.3 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నివాస ప్రాంతాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న



ఇబ్బందులను, భద్రతాపరమైన సమస్య లను మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రమాదాల ముప్పును తగ్గించేలా విద్యుత్ లైన్లను మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సీతక్క విజ్ఞప్తిపై ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ములుగు నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి సీతక్క చొరవతో ములుగు నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. విద్యుత్ లైన్ల మార్పు పనులు పూర్తయితే నివాస ప్రాంతాల్లో ప్రజలకు భద్రత పెరగడంతో పాటు, విద్యుత్ లైన్ల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులు తొలగి పోనున్నాయి. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషిచేసిన మంత్రి సీతక్కకు ఈ సందర్భంగా ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

---

## ప్రధాన ఎన్నికల కమిషనర్

# వెంటనే రాజీనామా చేయాలి: డా. రేఖ

**న్యూఢిల్లీ వెలుతురు అక్టోబర్ 12:** ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియపై వచ్చిన అక్రమాల ఆరోపణలకు జవాబుదారీతనం వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బి. మహేశ్ కుమార్ గౌడ్ గారి ఆదేశాలతో, ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఢిల్లీలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు,




ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరగాలి. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలి. ఎన్నికల కమిషన్ ఏ పార్టీ ఒత్తిడికీ తలొగ్గకుండా రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి. బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసే ప్రయత్నాలను కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది" అని డా. రేఖ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

## రూ.46 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 12: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ డివిజన్, ఖ.ఎ.=. వ్యాలీ మెయిన్ రోడ్డులో నెలకొన్న రహదారి సమస్యలను స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో, ఆయన ప్రత్యేక చొరవతో జవీజ నిధుల నుంచి రూ.46 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు సంగొల్ల మహేందర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడంతో పాటు, దుండిగల్ డివిజన్‌లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, ప్రాంత సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, కొలన్ జీవన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, నిజాంపేట్ సర్కిల్ డివిజన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బోట్ల విజయ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిసరి మహేందర్ రెడ్డి, మనోజ్, సురేష్, లక్ష్మారెడ్డి, గురువారెడ్డి, మనోహర్, గోపాల్ పద్మారావు, ఆకుల ప్రేమ్ కుమార్, మల్లంపేట్ ప్రకాష్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌గా కుత్బుల్లాపూర్ చౌరస్తాను తీర్చిదిద్దండి



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 12:** సోమవారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో వారి కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రోడ్ల విస్తరణ, సీఎంసీ లో విలీనమైన శివారు మున్సిపాలిటీలలో పారిశుద్ధ నిర్వహణ, అస్తవ్యస్తంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాను ట్రాఫిక్ ఫ్రీ చౌరస్తాగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. అదేవిధంగా కొత్తగా ఏర్పాటైన సిఎంసి కార్పొరేషన్ లో విలీనమైన శివారు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, సివరేజ్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ప్రణాళిక బద్ధంగా శివారు సర్కిల్ ల పరిధిలో మౌలిక వసతులను చేపట్టి కొంపల్లి, నిజాంపేట్, దుండిగల్ సర్కిల్ ల లోని అన్నీ ప్ర ప్రాంతాలను అభివృద్ధి పరచాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంతో పాటు పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమీషనర్ శంకర్ సింగ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే మా ధ్యేయం

– పీఏసీఎస్ నూతన చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి



**శంకర్పల్లి, వెలుతురు అక్టోబర్ 12 :** శంకర్పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా బొల్లారం వెంకటరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో 12 మంది నూతన డైరెక్టర్లు కూడా ఈ సందర్భంగా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తనకు పీఏసీఎస్ చైర్మన్‌గా సేవ చేసేందుకు అవకాశం కల్పించిన జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో మరియు ఈ పదవీ బాధ్యతలు చేపట్టడంలో తనకు పూర్తి స్థాయిలో సహకరించిన శంకర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ముఖ్యంగా సహకార సంఘం రైతులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తమ నూతన పాలకవర్గం ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలిచి, వారి సంక్షేమం మరియు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. సొసైటీ పరిధిలోని రైతులకు అవసరమైన సేవలను, సదుపాయాలను మరింత వేగంగా, పారదర్శకంగా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నూతన డైరెక్టర్లు, సహకార శాఖ అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు



**మంచాల వెలుతురు అక్టోబర్ 12:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలో భాగంగా శ్రీసాయి మేస్త్రి అసోసియేషన్ వేణుగోపాలస్వామి భజనమండలి,జై భవాని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిశరన్నవరాత్రుల ఉత్సవాలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ మం చాల మండల అధ్యక్షులు చీరాల రమేష్ గ్రామసర్పంచ్ మానుపాటి శోభకుమార్ ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ పాండాల జంగయ్యగౌడ్ పున్నంరాము భాను.చిందం రఘుపతి చిందం జంగయ్య మాదుగుల కృష్ణగౌడ్ మొ్రిఐలయ్య చిందం వెంకటేష్(స్టీల్) కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాషయ్య చిందం యాదయ్య చెరుకు రామచంద్రయ్య నూకం బాలరాజ్ ముది రాజ్ రావుల రాఘవ మాదుగుల బుచ్చయ్యగౌడ్ ఆర్ల శ్రీనివాస్ చెరుకు శ్రీశైలం గుడ్డిమల్ల రాజు ముదిరాజ్ జ్ఞానేశ్వర్ రెడ్డి కిషోర్ రెడ్డి ఆర్ల యాదయ్య చిందం ఐలయ్య గొరిగే పాండు కొండూ రు మల్లేష్ చెరుకు రాజు శంకర్ స్వామి రావుల బీరప్ప మొ్రి శ్రీశైలం ఆర్ల శ్రీకాంత్ గొరిగే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## భార్గవి కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్ షాప్ ప్రారంభోత్సవం

### పాల్గొన్నఆరుట్ల గ్రామ ఉపసర్పంచ్

**మంచాల వెలుతురు అక్టోబర్12:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో స్వయం ఉపాధి వ్యాపారంలో భాగంగా చెన్నమోనిశంకర్ ముదిరాజ్ దంపతులు ఏర్పాటు చేసుకున్న భార్గవి కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్ షాప్ ప్రారం భోత్సవం చేసిన ఆరుట్ల ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ ముదిరాజ్ సంఘం పెద్దలు ఈ సందర్భంగా ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాట్లాడుతూ ఎంబ్రాయిడరీ వర్క్ లాంటి కు టీర పరిశ్రమలు గ్రామాల్లో పెట్టడం చాలా అభినందనీయం అని అన్నారు ఇలాంటి ఎంబ్రాయిడ రీ వర్కు చేయించుకోవాలి అంటే హైదరాబాద్ నగరానికి వెళ్ళవలసి వస్తుండే కానీ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మన ఆరుట్ల గ్రామంలోనే అన్ని రకాల కుటీర పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ప్రజలు హైదరాబాద్ నగరానికి వెళ్లకుండా ఇబ్బందులు తప్పుతున్నాయి అన్నారు చెన్నమోని శంకర్ ముదిరాజ్ దంపతులు వ్యాపార పరంగా బాగా ఎ దగాలని కోరుకుంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నూకం సత్తయ్యము దిరాజ్ గుడ్డి మల్ల చంద్రయ్య



ముదిరాజ్.మానిపాటి కుమార్ వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్ ఆరుట్ల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కావలి శ్రీనివాస్ ముదిరాజ్ నూకం బాలయ్య శేఖర్ ముదిరాజ్ దాసరమోని రమేష్ ముదిరాజ్ బుట్టి జంగయ్య ముదిరాజ్ తలారి కృష్ణ ముదిరాజ్ ఇం దిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ ముదిరాజ్ గుడ్డిమల్ల రాజు ముదిరాజ్ శంకర్ ముదిరా జ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

### మౌలిక వసతులతో

## కాలనీల్లో మెరుగైన అభివృద్ధి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 12:**సోమవారం 132 – జీడిమెట్ల ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేజ్ – 1 లో 6.70 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న త్రాగునీటి సరఫరా పైప్ లైన్ పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, జీడిమెట్ల డివిజన్ లోని అన్నీ బస్తీల్లో గత పన్నండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ శివ ప్రసాద్, కాలనీ అధ్యక్షులు సంపత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సంయుక్త సహాయ కార్యదర్శి పరమేశ్వర్ గౌడ్, కోశాధికారి కరుణాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి, విజయ్, కమిటీ సభ్యులు శివకుమార్, బాపి రెడ్డి, నాగేశ్వర్ రావు, కాశీనాథ్,



శ్రీనివాస్ రెడ్డి, సత్య రామ్, వినోద్ రెడ్డి, వెంకటేష్, ఎల్లా గౌడ్, కాలనీ వాసులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## బి.ఎన్.రెడ్డి నగర్‌లో శివ బాలాజీ ఈవీ సర్వీస్ స్టేషన్ ప్రారంభం

**అన్ని రకాల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు మరమ్మతు సేవలు**




**వెలుతురు బి.ఎన్.రెడ్డి నగర్ అక్టోబర్ 12:** హైదరాబాద్‌లోని బి.ఎన్.రెడ్డి నగర్ పరిధిలో, భారతి విద్యాలయ పాఠశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివ బాలాజీ ఈవీ సర్వీస్ స్టేషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సర్వీస్ స్టేషన్‌లో అన్ని రకాల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు మరమ్మతు సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. వాహన దారులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు, ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు.

**అందుబాటులో ఉన్న సేవలు:**
- త్వరితగతిన వాహన తనిఖీ, మరమ్మతులు
- అవసరమైన విడిభాగాల విక్రయం
- బ్యాటరీ, ఛార్జర్ మరమ్మతులు
- అద్దెకు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు

ఓలా, చేతక్, ఐక్యూబ్, ఏథర్, టార్క్ తదితర ప్రముఖ కంపెనీలకు చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు ఇక్కడ మరమ్మతు సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, వాహనదారులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులు: అల్లెంకి ప్రశాంత్

## పనకబండ గ్రామంలో అయ్యప్ప సన్నిధానానికి భూమిపూజ



**మోత్కూర్, అక్టోబర్12,వెలుతురు న్యూస్ :** మోత్కూరు మండలం పనకబండ గ్రామంలో ప్రతి సంవత్సరం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తున్నారు. అయితే దీక్షా సమయంలో స్నానం కోసం, వంట చేసుకోవడం కోసం, నిద్రించడానికి సరైన సన్నిధానం లేక అయ్యప్ప స్వాములు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన ఓర్సు నర్సింహా కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఓర్సు రేణుకా నరసింహ వారి కుమారులు వెంకటేష్ మరియు పవన్ తేజ ఇకముందు మాల వేసే భక్తులకు ఇలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో అయ్యప్ప సన్నిధానాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారు. సోమవారం నాడు అయ్యప్ప సన్నిధాన నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అయ్యప్ప స్వాముల కోసం స్వయంగా ముందుకు వచ్చి సన్నిధానం ఏర్పాటు చేస్తున్న వారిని అభినందిస్తూ గ్రామ సర్పంచ్ లోతుకుంట రేణుక - అనిల్ కుమార్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రాదారపు మల్లేష్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్ గారు, మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు లోతుకుంట స్వామి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బత్తిని ధర్మయ్య, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో రబీ సాగుపై వీడియో కాన్ఫరెన్స్



**నూతనకల్ , అక్టోబర్ 12:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు నూతన్కల్ మండలంలోని మిరియాల రైతు వేదిక, తాళ్లసింగారం రైతు వేదిక మరియు దర్శనపల్లి రైతు వేదికల్లో రైతుల కోసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు గారు ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారు ఫోన్ ద్వారా రైతులకు సందేశాన్ని అందించి, తగిన సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పరిణామాలు, రాబోయే రబీ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి, ఏఈ (ఎలక్ట్రికల్), తాళ్లసింగారం గ్రామ సర్పంచ్, బక్కెహెమ లతండా గ్రామ సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి లూనావత్ సాయిప్రసాద్ ఏఇఓ జానయ్య గారు, ఏఇ ఓ సంధ్య గారు, ఏఇ ఓ పావని గారు, గ్రామ పంచాయతీ అధికారులు (జీపీఓలు), పంచాయతీ కార్యదర్శులు, సెర్ప్ సిబ్బంది మరియు ఆయా రైతు వేదికల పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# 72,000 మంది విద్యార్థులకు అల్పాహారం భోజనం

**దివీస్ అందించిన రూ 12.8 కోట్లతో చౌటుప్పల్ శివారులో గ్రీన్ ఫీల్డ్ కిచెన్ నిర్మాణానికి శంకుస్థాపన**

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 12:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ శివారులో గ్రీన్‌ఫీల్డ్ సెంట్రల్ కిచెన్ నిర్మాణానికి హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యచంద్ర స్వామీజీ శంకుస్థాపన చేశారు. దివిస్ లేబరేటరీ యాజమాన్యం హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ కు అందజేసిన 12 కోట్ల 80 లక్షలతో చౌటుప్పల్ శివారులో కేంద్రీకృత వంటశాలను నిర్మిస్తున్నారు. ఈ వంటశాలలో రోజుకు 75 వేలమంది విద్యార్థులకు అల్పాహారం, భోజనం సిద్ధం చేసే సామర్థ్యంతో నిర్మాణం చేస్తున్నారు. శంకుస్థాపన సందర్భంగా హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్య చంద్ర స్వామీజీ మాట్లాడుతూ, ఈ వంటశాల నిర్మాణాన్ని ఏడాదిలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఇక్కడ తయారుచేసిన అల్పాహారం భోజనం 24 మండలాల్లోని 966 పాఠశాలలకు చెందిన 72 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజు అందజేయనున్నట్టు తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమం చేపట్టడానికి దివిస్ లాబరేటరీ యాజమాన్యం తమతో భాగస్వామ్యం అయినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దివిస్ లేబరేటరీ సి యాజమాన్యం విశాఖపట్నంలోనూ కేంద్రీకృత వంటశాల నిర్మాణానికి తమ సంస్థతో సహకారం అందించిందని చెప్పారు. ఈ వంటశాల ద్వారా ఆహారం అందుకునే 72,000 మంది విద్యార్థుల ఆశీర్వాదాలు దివిస్ లేబరేటరీ యజమాని



మురళీ కృష్ణకు జీవితాంతం అందుతాయని ఆయన ఆశీర్వదించారు. చారిటబుల్ ఫౌండేషన్ సీఈవో కౌంతేయ దాస, దివిస్ మేనేజర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలం : మాజీ ఎమ్మెల్యే

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు గాను రైతులకు ప్రభుత్వం త్రీఫేస్ విద్యుత్‌ను నిరంతరంగా కొనసాగించాలని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం త్రిపురారం మండల కేంద్రంలో వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్‌ను అందించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందజేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రైతులకు విద్యుత్‌ను అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తలాపున కృష్ణానది ఉన్నా సాగునీరు అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో కరువు ఛాయలు అలుముకున్నప్పటికీ ముందస్తు ప్రణాళికలు తయారు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. వచ్చే యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. బోరుబావుల కింద తిండి గింజల కోసం వరి సాగు చేసిన రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రైకర్ చైర్మన్ ఇస్లావత్ రామచందర్ నాయక్, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : ఆర్. కృష్ణయ్య



సికింద్రాబాద్: రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారిని క్రమబద్ధీకరించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను నెలకు రూ. 30 వేలకు పెంచాలని కోరారు.

సోమవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మైనారిటీ గురుకుల నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, నెలల తరబడి జీతాలు అందకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల విద్యా ఫీజులు, ఇంటి అద్దెలు, కుటుంబ ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని 26 మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ వంటి సౌకర్యాలను పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లు, కార్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిపై పని భారం అధికంగా ఉన్నప్పటికీ, వారికి తగిన వేతనాలు అందడం లేదని విమర్శించారు. నెలకు గరిష్ఠంగా రూ. 15 వేల వరకు మాత్రమే వేతనం లభిస్తోందని, అది కూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఉద్యోగులు ప్రైవేట్ సంస్థల వైపు వెళ్లిపోతున్నారని తెలిపారు. ఉద్యోగుల వేతనాలను నెలకు రూ. 30 వేలకు పెంచి, వారికి ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమిళనాడు, కేరళ, ఒడిశా, రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. తెలంగాణలోనూ అదే తరహాలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 72 ప్రభుత్వ శాఖలు, 65 ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 4.90 లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ విధానం వల్ల ఉద్యోగుల్లో అభద్రతాభావం పెరుగుతోందని, ఇది పరిపాలనా వ్యవస్థపై ప్రభావం చూపుతోందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారికి అన్ని హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. మైనారిటీ గురుకుల నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండీ హుస్సేన్ షరీఫ్, అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఉద్యోగులు మొరాజ్, మంగ, జయమ్మ, అనంతయ్య, అల్లం యాదయ్య, సి. రాజేందర్, నీలం వెంకటేష్, దొడ్డిపల్లి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



## జనగాం గ్రామంలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**నారాయణపురం వెలుతురు అక్టోబర్ 12:** నారాయణపురం మండలం జనగాం గ్రామంలో దుర్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఆదివారం స్థానిక సీతారామచంద్ర స్వామి దేవాలయంలో గ్రామ ప్రజలందరూ కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదాలు పొందుతూ తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నేపతి శ్రీనివాసులు, బొంగు రఘు గౌడ్, సుభాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రమేష్, భాస్కర్ గుప్తా, తోటయ్య చారి, తండ నర్సింహ గౌడ్, బెలిద సుధాకర్, బెలిద రవి, గ్రామ పెద్దలు, దేవాదాయ కమిటీ చైర్మన్ బైకని యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా, తండ యాదయ్య గౌడ్, తిరుమలేష్, సత్తయ్య, జైపాల్, రిత్విక్ రెడ్డి, నిశాంత్, దీపక్ గుప్తా, ప్రత్యుణ, బిట్టు తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన.. జాతీయ స్థాయి గుర్తింపు




జిల్లాలో ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన కార్యక్రమం అమలులో విశిష్ట సేవలు అందించినందుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక సోమవారం న్యూఢిల్లీలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలులో జిల్లా యంత్రాంగం చేసిన కృషికి ఈ గుర్తింపు లభించడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడం, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాల్లో అధికారులు అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ అవార్డు సాధనలో భాగస్వాములైన జిల్లా అధికారులందరికీ, వారి బృందాలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారం, కృషి, బాధ్యతాయుతమైన పనితీరు ఈ విజయానికి పునాది అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే బృంద స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లను సాధించాలని ఆకాంక్షించారు. నారాయణపేట జిల్లాకు లభించిన ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగానికి మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజుల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ అవార్డు ప్రేరణగా నిలుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రూ.20 లక్షల కోసమే ఘాతుకం!

: హైదరాబాద్‌లోని కౌకూర్‌లో ఐదేళ్ల చిన్నారి ఆరిలియా హత్య కేసును పోలీసులు ఛేదించారు. చిన్నారిని కిడ్నాప్ చేసినట్లు నమ్మించి రూ. 20 లక్షలు వసూలు చేయాలనే ఉద్దేశంతోనే నిందితుడు విక్రమ్ కుమార్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి తెలిపారు. సోమవారం డీసీపీ శ్రీధర్, ఎస్ఓటీ అధికారులతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు.

అక్టోబర్ 10వ తేదీ రాత్రి కౌకూర్‌లోని విల్లా ఆర్చిడ్ గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్న రీసెర్చ్ సైంటిస్ట్ మిల్టన్ ఫెర్నాండెజ్ తన కుమార్తె కనిపించడం లేదని, గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి రూ. 20 లక్షలు డిమాండ్ చేశాడని బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డబ్బులు సికింద్రాబాద్‌కు తీసుకురావాలని నిందితుడు కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు దాదాపు 10 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కమ్యూనిటీలోని సుమారు 130 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఈ క్రమంలో క్లబ్‌హౌస్ సమీపంలోని సంప్‌లో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. చిన్నారి చేతులు, కాళ్లు కట్టేసి, ఇటుకలు కట్టి సంప్‌లో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రాథమిక పోస్టుమార్టం నివేదిక ప్రకారం చిన్నారిని గొంతు నులిమి హత్య చేసిన అనంతరం సంప్‌లో పడేసినట్లు వెల్లడైంది.

బిహార్‌లోని నలంద జిల్లాకు చెందిన విక్రమ్ కుమార్ సెప్టెంబర్ 22న విల్లా ఆర్చిడ్ గేటెడ్ కమ్యూనిటీలో సెక్యూరిటీ గార్డుగా చేరాడు. విధుల్లో ఉన్న సమయంలో సిగరెట్లు తాగడం, మద్యం సేవించడం గమనించిన మరో సెక్యూరిటీ గార్డు ఈ విషయాన్ని సూపర్‌వైజర్‌కు తెలియజేశాడు. దీంతో విక్రమ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించినట్లు పోలీసులు తెలిపారు. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కూడా అతడు అదే ప్రాంతంలో సెక్యూరిటీ గార్డులు ఉండే గదిలో కొంతకాలం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. ఆ సమయంలో కమ్యూనిటీలో నివసించే కుటుంబాలు, వారి పిల్లలు క్లబ్‌హౌస్‌కు వచ్చే సమయాలు, నిర్మానుష్య ప్రాంతాల గురించి తెలుసుకున్నట్లు తెలిపారు.

పోలీసుల కథనం ప్రకారం.. ఘటన జరిగిన రోజు సాయంత్రం 6.45 గంటల సమయంలో విక్రమ్ కుమార్ విల్లా ఆర్చిడ్‌లోకి ప్రవేశించాడు. క్లబ్‌హౌస్ వద్ద బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతుండటంతో, వాటికి సహాయం చేసేందుకు వచ్చినట్లు చెప్పి లోపలికి వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆ సమయంలో ఇతర పిల్లలు వెళ్లిపోవడంతో ఆరిలియా ఒంటరిగా ఉండటాన్ని గమనించిన నిందితుడు, మాయమాటలతో ఆమెను సంప్ ప్రాంతానికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ చిన్నారిని గొంతు నులిమి హత్య చేసి, చేతులు, కాళ్లు కట్టి, ఇటుకలు కట్టి సంప్‌లో పడేసినట్లు పేర్కొన్నారు. అనంతరం




చిన్నారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ. 20 లక్షలు డిమాండ్ చేసినట్లు వెల్లడించారు.

చిన్నారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తూనే నిందితుడు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు బట్టలు మార్చుకుని, టోపీ, మాస్క్ ధరించి నగరంలోని పలు ప్రాంతాల్లో తిరిగినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి క్షేమంగా ఉందని నిర్ధారించేందుకు వీడియో కాల్ చేయాలని కుటుంబ సభ్యులు కోరినప్పుడు వాయిస్ మెసేజ్‌లు పంపి తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ ఫోన్‌లోని సిమ్ కార్డును తీసుకుని రీఛార్జ్ చేయించి, దాని ద్వారానే ఫోన్ కాల్స్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో ఆదివారం రాత్రి విక్రమ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నిందితుడి అరెస్టు విషయం తెలుసుకున్న విల్లా ఆర్చిడ్ నివాసితులు సికింద్రాబాద్‌లోని మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ క్యాంపు కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. సుమారు మూడు గంటల పాటు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా నిందితుడికి మరెవరైనా సహకరించారా అనే కోణంలోనూ విచారణ జరపాలని, సెక్యూరిటీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని నివాసితులు డిమాండ్ చేశారు. ఉద్యోగం నుంచి తొలగించిన వ్యక్తి తిరిగి కమ్యూనిటీలోకి ఎలా ప్రవేశించాడనే అంశంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఆందోళనకారులతో మాట్లాడిన డీసీపీ శ్రీధర్, కేసులో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. చిన్నారి హత్య కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## నీటి లభ్యతను బట్టే యాసంగి పంటల ఎంపిక : సంగారెడ్డి కలెక్టర్



ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లాలో రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో ఉంచుకొని యాసంగి 2026--27 సీజన్‌లో రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్ సంగారెడ్డి రైతు వేదిక నుంచి సంబంధిత శాఖల అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావం, యాసంగి పంటల ప్రణాళిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగం, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం, తాగునీటి సంరక్షణ వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సూచనలు చేశారు. యాసంగి సీజన్‌లో నీటి లభ్యత ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర స్థాయి అధికారులు సూచించారు. పెసలు, మినుములు, శనగ, కుసుమ వంటి పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. బిందు సేద్యం ద్వారా ఆయిల్‌పామ్, కూరగాయల సాగు చేపట్టి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరుబావుల రీఛార్జ్ పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని, తద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని, భూగర్భ జలాల పరిస్థితిపై అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ రైతులతో మాట్లాడుతూ, నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

# కమిషన్‌లు ఇచ్చుకోలేము.. ఉండలేము

- ఫాం ల్యాండ్లకు తాళాలు
- ఆధార పడిన వారి పరిస్థితి ఏమిటి
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బిడెకన్నే హన్మంతప్ప



**వెలుతురు నారాయణఖేడ్,అక్టోబర్ 12:**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గ అధికార పార్టీ నాయకులకు ఫాం ల్యాండ్ల యజమానులు అడిగినంత కమీషన్ లు ఇచ్చుకోలేక,భూముల రిజిస్ట్రేషన్ లు చేసుకోలేక ఫాం ల్యాండ్లకు తాళాలు వేసి ఇంటిముఖం పట్టారని నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిడెకన్నే హన్మంతప్ప అన్నారు.ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..ఖేడ్ నియోజకవర్గానికి రియల్ ఎస్టేట్ మరియు ఫాం ల్యాండ్ల యజమానులను పరిచయం చేసిందే తానని,ఈరోజు రాజకీయ నాయకులు కోరినంత కమిషన్ లు ఇచ్చుకోలేక ఫాం ల్యాండ్ల యజమానులు ఇంటీ ముఖం పట్టడం బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.సుమారు 15 ఏళ్ల క్రితం ఖేడ్ లో భూములు కొనడం, అమ్మడం,ఇతరులకు కొనిపించడం చేశానని, ఎందుకు పనికిరాని భూములకు సైతం లక్షల రూపాయలు పెట్టించి భూములను కొనుక్కునేలా చేశానని,రియల్టర్లు రావడం,ఫాం ల్యాండ్లు ఏర్పాటు వల్ల వెనుకబడిన నారాయణఖేడ్ ప్రాంతానికి నేడు గుర్తింపు వచ్చింది అన్నారు. కొండలు,గుట్టల భూములను ఫాం ల్యాండ్ల యజమానులు లక్షలు ఖర్చుచేసి రోడ్లు వేయడం,బోర్లు వేసి మొక్కలు పెంచడం వల్ల గ్రామాలు,తాండాలకు కళ వచ్చింది అన్నారు.2 నుండి 3 లక్షలకు ఎకరం ఉన్న భూములకు నేడు 10 నుండి 20లక్షల రూపాయల విలువ వచ్చింది అంటే దానికి కారణం ఫాం ల్యాండ్ల ఏర్పాటు,వాటి యజమానులే కారణం అన్నారు.ఒక ఫాం ల్యాండ్ ఏర్పాటు వల్ల మధ్యవర్తి, వ్యవసాయ కూలీలు,వాచ్ మెన్,జెసిబి డ్రైవర్,దాని యజమాని, పెట్రోల్,డీజిల్ పంపు యజమాని, దాబాలు, హోటళ్ళు,కిరాణం దుకాణం యజమాని, సూపర్వైజర్, మేనేజర్,మార్కెటింగ్ మేనేజర్,సేల్స్ మేన్,రెవిన్యూ అధికారులు, సిబ్బంది,సామాజిక సేవా కార్యకర్తలు, క్రషింగ్ మిషన్ యజమాని, ట్రాక్టర్ డ్రైవర్, యజమాని, బోరుబండి యజమాని,వంట మనుషులు, చికెన్, మటన్ దుఖానాల యజమానులు,ఇలా సుమారు 40 రకాల వ్యక్తులు ఉపాధి పొందుతున్నారు అన్నారు.గత కొంతకాలంగా స్థానిక నాయకుల ఒత్తిడిమేరకు తహసీల్దార్ లు భూములను రిజిస్ట్రేషన్ లు చేయకపోవడం ఏమిటి? అన్నారు.గుంటల చొప్పున భూములు రిజిస్ట్రేషన్ చేయనప్పుడు భూ భారతిలో ప్రభుత్వం ఆప్షన్ ఎందుకు ఉంచిందని,స్లాట్ పేరుతో చలాన కట్టించుకున్న ప్రభుత్వం ,అధికారులకు రిజిస్ట్రేషన్ ఆపే అధికారం ఎవరు ఇచ్చారు అన్నారు.గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ లు రాష్ట్ర వ్యాప్తంగా నిలిపివేశారా? కేవలం నారాయణఖేడ్ లోనే నిలిపివేశారా? రాష్ట్రానికి ఒక చట్టం,నారాయణఖేడ్ కు ఒక రెవిన్యూ చట్టం ఉంటుందా అన్నారు. అధికార పార్టీ నాయకులు ఎకరానికి లక్ష రూపాయలు డిమాండ్ చేయడమే కాకుండా,మాకు సంప్రదించ కుండా గుంట భూమి కూడా రిజిస్ట్రేషన్ చేయరాదని రెవిన్యూ అధికారులకు హుకూం జారీ చేయడమేమిటి అన్నారు.రిజిస్ట్రేషన్ లు చేయకుండా ఎవరు ఆపమని చెప్పారో రెవిన్యూ అధికారులు వారి పేర్లను చెప్పాలని డిమాండ్ చేశారు. లిటిగేషన్ లు ఉన్న భూములను,అసైన్డ్ భూముల కబ్జా ఉంటే,కోర్టు కేసులో ఉన్న భూములు, ఏవైనా పిర్యాదులు ఉన్న భూముల రిజిస్ట్రేషన్ ఆపితే పర్వాలేదని అన్ని సక్రమంగా ఉన్న భూముల రిజిస్ట్రేషన్ లు ఎలా నిలిపి వేస్తారు అన్నారు. భూముల రిజిస్ట్రేషన్ లు నిలిపివేయడంతో ఫాం ల్యాండ్ల యజమానులు తమ భూములను వదిలేసి ఇళ్లకు వెళ్తున్నారని,వారు వ్యాపారాలు మానేసి వెళ్లిపోవడం వల్ల వారిపై ఆధారపడి జీవిస్తున్న పేద కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉన్నందున ఫాం ల్యాండ్లను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని, లేని యెడల రాష్ట్రంలోని ఫాం ల్యాండ్ల యజమానులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.రిజిస్ట్రేషన్‌లు నిలిపి వేయడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడే అవకాశం ఉంది అన్నారు.

# రూ.5 లక్షల సుపారీతో మామ హత్య!

- కొద్ది గంటల్లోనే కేసును ఛేదించిన చిరాగ్‌పల్లి పోలీసులు
- వివరాలు వెల్లడించిన జహీరాబాద్ పట్టణ సీఐ రవి



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం తుంకుంట గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మున్నూరు శ్రీనివాస్ హత్య కేసును చిరాగ్‌పల్లి పోలీసులు కొద్ది గంటల్లోనే ఛేదించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. మృతుడి అల్లుడు ఎర్ర బసవరాజు రూ.5 లక్షలు ఇచ్చి హత్య చేయించినట్లు వెల్లడైంది. ఈ కేసులో మరో ముగ్గురి ప్రమేయాన్ని గుర్తించిన పోలీసులు, నేరానికి సంబంధించిన నగదు, సెల్‌ఫోన్లు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మున్నూరు శ్రీనివాస్‌ను హత్య చేసేందుకు ఆయన అల్లుడు ఎర్ర బసవరాజు రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు విచారణలో వెల్లడైంది. బంటారం గ్రామానికి చెందిన జడల రమేష్, జడల సుభాష్, పరిగి మురళితో కలిసి ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు మృతుడి ఆటోను అద్దెకు తీసుకొని తుంకుంట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి శ్రీనివాస్‌పై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

### మృతదేహం, ఆటోకు నిప్పు

హత్య అనంతరం ఆధారాలను ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో మృతదేహంతో పాటు ఆటోపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు.

### రూ.2 లక్షలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఈ కేసులో నిందితుల వద్ద నుంచి రూ.2 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఆయుధాలు, మోటార్‌సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నంబర్ 104/2026గా నమోదు చేసి, భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 103(1), 238, 3(5) కింద కేసు దర్యాప్తు చేపట్టారు.

### పోలీసు బృందానికి అభినందనలు

హత్య కేసును అతి తక్కువ సమయంలో ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన జహీరాబాద్ టౌన్ సీఐ రాజబోయిన రవి, చిరాగ్‌పల్లి ఎస్ఐ వినయ్ కుమార్‌తో పాటు కానిస్టేబుళ్లు రాకేష్, హరినేత్ర, ఓం దేవ్, ఆస్లాంను అధికారులు అభినందించారు.

# ఫాం ల్యాండ్ల రిజిస్ట్రేషన్‌లు పునరుద్దరించాలి



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 12 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని ఫాం ల్యాండ్ల రిజిస్ట్రేషన్ లు పునరుద్దరించి వాటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఆదుకోవాలశీటు ఫాం ల్యాండ్లలో పనిచేసే వారు సోమవారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని ఫాం ల్యాండ్లలో వ్యవసాయ భూముల నిర్వహణ, మొక్కల పెంపకం, వాచ్ మెన్, డ్రైవర్లుగా,వంటమనుషులుగా,ఇలా సుమారు 50 రకాల పనులను నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాము అన్నారు.కుటుంబ పోషణ భారమై హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వలసలు వెళ్ళాలి అనుకున్నవాళ్ళము,వెళ్లిన వారిమి మా ప్రాంతంలో ఫాం ల్యాండ్ల ఏర్పాటు తర్వాత భార్యా,పిల్లలతో అందులో పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాము అన్నారు.బ్రతుకులు హాయిగా,సాఫిగా సాగిపోతున్న తరుణంలో తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు గుంటల చొప్పున భూముల రిజిస్ట్రేషన్ లు నిలిపివేయడంతో ఫాం ల్యాండ్ల యజమానులు ఫాం ల్యాండ్లకు తాళాలు వేసి వారి వారి ప్రాంతాలకు వెళ్లిపోయారు అన్నారు.ఫాం ల్యాండ్ల రిజిస్ట్రేషన్ లు నిలిపివేయడం వల్ల భూముల రిజిస్ట్రేషన్ లు జరగనప్పుడు,మీకు జీతాలు ఇచ్చుకోలేము కాబట్టి పనులకు రాకండి అంటూ ఫాం ల్యాండ్ల యజమానులు మమ్మల్ని పనుల నుండి తీసివేయడం వల్ల తిరిగి మా బ్రతుకులు రోడ్డున పడ్డాయి అన్నారు. ఫాం ల్యాండ్ల రిజిస్ట్రేషన్ లలో సాంకేతిక,రాజకీయ ఇతర ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటిని స్పష్టంగా తెలియజేసి,అర్హత కలిగిన భూముల రిజిస్ట్రేషన్ లు తిరిగి కొనసాగేలా చర్యలు తీసుకోవాలి అన్నారు.రిజిస్ట్రేషన్ లు నిలిచిపోవడం వల్ల వాటిపై ఆధారపడి జీవిస్తున్న పేద,దళిత కుటుంబాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వెంటనే రిజిస్ట్రేషన్ ల ప్రక్రియ కొనసాగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్,మోహన్ పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

## 265 మంది అభ్యర్థులకు నిపుణులైన ఫ్యాకల్టీతో శిక్షణ





**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**
పోలీస్ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా కష్టపడి చదివి, పట్టుదలతో సాధన చేస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ అభ్యర్థులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి డీఎస్పీ సైదా నాయక్, ఆర్డీవో దేవుజా, ఆర్ఎల్ఆర్ పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్. లక్ష్మారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ సైదా నాయక్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 10న ఉచిత పోలీస్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న 588 మంది అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించగా, అందులో 265 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఆర్ఎల్ఆర్ పాఠశాలలో నిపుణులైన ఫ్యాకల్టీతో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలీస్ ఉద్యోగాలకు ఎంపిక కావాలనే లక్ష్యంతో అభ్యర్థులు క్రమశిక్షణతో చదువుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను నిరంతరం సాధన చేయాలని సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పట్టుదల, కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకొని జహీరాబాద్ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో యువత ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సీఐ రవి, గ్రామీణ సీఐ నర్సింహా, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బర్ధిపూర్‌లో నవరాత్రి సందడి!

## భవాని దీక్షలో 100 మంది యువతీ యువకులు.. నేటి యువతకు ఆదర్శం...

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**
దసరా నవరాత్రి ఉత్సవాలతో ఝరాసంగం మండలం బర్ధిపూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామంలోని శ్రీ భవానీ దేవాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ప్రతిష్ఠించి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం విదియ సందర్భంగా భవానీమాత శ్రీ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గ్రామానికి చెందిన మహిళలు, యువతీ యువకులు నియమనిష్ఠలతో పూజల్లో పాల్గొంటున్నారు. సుమారు 100 మంది యువతీ యువకులు భవాని దీక్ష చేపట్టి తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. యువత సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల పట్ల ఆసక్తి చూపుతూ దీక్ష చేపట్టడం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. నవరాత్రి ఉత్సవాలతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

# గార్బా--దాండియా వేడుకలను విజయవంతం చేయాలి

## జహీరాబాద్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుభాష్ రాథోడ్

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**



విజయదశమి పండుగను పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపంలో నేడు సాయంత్రం గార్బా--దాండియా నైట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జహీరాబాద్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) సుభాష్ రాథోడ్ నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు, ఉత్సవాలు ఐక్యతకు ప్రతీకలని సుభాష్ రాథోడ్ పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే గార్బా--దాండియా కార్యక్రమంలో మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులతో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు, యువతులు పాల్గొనే కార్యక్రమం కావడంతో నిర్వాహకులు అన్ని రకాల భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

# కరెంటు కోతలతో రైతు కళ్ళలో నీళ్లను తెప్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## మండల కేంద్రంలో బిఆర్ఎస్ తలపెట్టిన రైతు ధర్నాలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 12:**
కౌడిపల్లి మండల కేంద్రంలో మండల బి ఆర్ ఎస్ అధ్యక్షుడు సారా రామ గౌడ్ ఆధ్వర్యంలో కరెంటు కోతలకు నిరసనగా తలపెట్టిన ధర్నాకు ముఖ్యఅతిథిగా నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల మాటను తుంగలో తొక్కిందని, రైతులను అప్పుడు యూరియా కొరకు, ఇప్పుడు కరెంటు కోతలతో నట్టేట ముంచుతుందని ఎద్దేవా చేశారు. రైతులకు 24 గంటల కరెంటు ఇస్తానని చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం 6 గంటలు కూడా ఇవ్వడం లేదని తీవ్రంగా విమర్శించారు. ఎద్దేడిసిన ఎవుసం - రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డట్టు చరిత్రలో లేదని ఇదే కాంగ్రెస్ ప్రభుత్వానికి చివరి అధికారమని మళ్లీ వచ్చేది రైతు ప్రభుత్వమైనటువంటి బిఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు సారా రామా గౌడ్ మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అన్ని కన్నీటి కష్టాలే అని, పండగనక పబ్బమనక రాత్రింబవళ్లు పంట పొలాల దగ్గర కరెంటు కొరకు వేచి చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ ఎస్ సర్పంచ్ లు, శివలి సతీష్, అల్మాయి పేటఎల్లం, కుమార్, బాకీ సుమలత రవి,శివనందరెడ్డి, రవి యాదవ్,యశోద బాలకృష్ణ,మాజీ సర్పంచ్ లు మహిపాల్ రెడ్డి, కాంతారావు, బి ఆర్ ఎస్ నాయకులు ప్రవీణ్ కుమార్, రవి సాగర్, సందీప్ కుమార్, అమర్ సింగ్, యదుల్, సంగప్ప బి ఆర్ ఎస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.





# శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం

## జహీరాబాద్‌లో భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పట్టణంలోని భవానీ మందిర్ రోడ్డులో డీసీఎంఎస్ కాంప్లెక్స్ వద్ద ఎక్కేల్లి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో రెండవ రోజు శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన మిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు నిత్య హోమ కార్యక్రమాలను చేపడుతున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని, పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఎక్కేల్లి హిందూ ఉత్సవ సమితి నిర్వాహకులు కోరారు.

# కీళ్ల నొప్పుల వెనుక ‘రుమటాయిడ్’ ముప్పు!

- నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యం.. సకాలంలో చికిత్సతో ఉపశమనం
- మహిళల్లో మూడు రెట్లు అధికం.. నొప్పి మాత్రలతో అసలు సమస్యకు చెక్ పడదు






**హైదరాబాద్ అక్టోబర్ 12(వెలుతురు సిటీ బ్యూరో):**
కీళ్ల నొప్పులంటే వయసు పెరగడం వల్ల వచ్చే సమస్యేనని భావించి చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో ఇవి రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి తీవ్రమైన వ్యాధులకు సంకేతాలు కావచ్చు. తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే కీళ్లు దెబ్బతినడం, చేతులు, కాళ్లు వంకరగా మారడం, కదలికలు పరిమితం కావడం వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అక్టోబరు 12న ప్రపంచ కీళ్ల వాత వ్యాధుల దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.




### ఉదయం బిగుసుకుపోతే అప్రమత్తం కావాలి

కీళ్ల అరుగుదల వల్ల వచ్చే నొప్పులకు, వాపుతో కూడిన కీళ్ల వాతానికి మధ్య తేడాను గుర్తించడం కీలకం. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో ముఖ్యంగా రెండు చేతుల వేళ్ల చిన్న కీళ్లలో నొప్పి, వాపు కనిపిస్తాయి. ఉదయం నిద్రలేవగానే అరగంట నుంచి గంటకుపైగా కీళ్లు బిగుసుకుపోవడం, విశ్రాంతి తర్వాత నొప్పి పెరగడం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఇలాంటి సమస్యలు ఆరు వారాలకు మించి కొనసాగితే వైద్యులను సంప్రదించాలి.

### మహిళల్లోనే ఎక్కువ ముప్పు

రుమటాయిడ్ ఆర్థరైటిస్ పురుషులతో పోలిస్తే మహిళల్లో సుమారు మూడు రెట్లు అధికంగా కనిపిస్తుంది. ముఖ్యంగా 30 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వారిలో ఎక్కువగా గుర్తిస్తున్నారు. జన్యుపరమైన అంశాలతో పాటు ధూమపానం కూడా వ్యాధి ముప్పును పెంచుతుంది. రక్త పరీక్షల్లో రుమటాయిడ్ ఫ్యాక్టర్ ఫలితం ప్రతికూలంగా వచ్చినంత మాత్రాన వ్యాధి లేదని నిర్ధారించలేమని, లక్షణాలు, ఇతర పరీక్షలను కలిపి పరిశీలించాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

### నొప్పి మాత్రలతో తాత్కాలిక ఉపశమనమే

నొప్పి నివారణ మాత్రలు, స్టెరాయిడ్లతో కొంతకాలం ఉపశమనం లభించినా వ్యాధి పూర్తిగా అదుపులోకి రాకపోవచ్చు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా వీటిని దీర్ఘకాలం వాడటం వల్ల ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. సరైన చికిత్స అందకపోతే కీళ్లకే కాకుండా కళ్లకు, ఊపిరితిత్తులకు కూడా సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

### సకాలంలో చికిత్సతో వైకల్యానికి అడ్డుకట్ట

ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభా లక్ష్మి, రుమటాలజీ కన్సల్టెంట్ మాట్లాడుతూ.. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ను తొలిదశలో గుర్తించి చికిత్స ప్రారంభిస్తే కీళ్ల నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వ్యాధి నియంత్రణకు ప్రస్తుతం ఆధునిక మందులు అందుబాటులో ఉన్నాయని, రుమటాలజీ వైద్యుల సూచనల మేరకు మందులు క్రమం తప్పకుండా వాడటం ఎంతో ముఖ్యమని వివరించారు. నొప్పి తగ్గిందనే కారణంతో చికిత్సను మధ్యలో ఆపకూడదని, అలా చేస్తే వ్యాధి మళ్లీ తీవ్రం కావచ్చని హెచ్చరించారు.

మందులతో పాటు రోజూ తగిన వ్యాయామం చేయడం, శరీర బరువును నియంత్రించుకోవడం, సరిపడా నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ఆరోగ్యానికి దోహదపడతాయని సూచించారు. కీళ్ల నొప్పులు, వాపు, ఉదయం కీళు బిగుసుకుపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు. సకాలంలో గుర్తింపు, సరైన చికిత్స, క్రమబద్ధమైన జీవనశైలితో రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఉన్నవారు కూడా సాధారణ జీవనాన్ని కొనసాగించవచ్చని స్పష్టం చేశారు.

# ఆరుట్ల శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం

## 32వ సోమవారం అన్నదాన ప్రభువులు గౌడ సంఘం అధ్యక్షుడు తంగడిపల్లి నరేందర్ గౌడ్ కొత్తపల్లి శేఖర్ గౌడ్



**మంచాల వెలుతురు అక్టోబర్12:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో ప్రతిసోమ వారం గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం32వ సోమవారం అన్నదాన ప్రభువులు గౌడ సంఘం అధ్యక్షుడు తంగడిపల్లి నరేందర్ గౌడ్ కొత్తపల్లి శేఖర్ గౌడ్ ముందుగా కంఠమహేశ్వర దేవాలయంలో గౌడసంఘం పెద్దలు ఇందిరమ్మ కమిటీసభ్యుడు చెరుకు నరసింహగౌడ్ శ్రీమహా లక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజుగౌడ్ పల్లె శ్రీనివాస్ గౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మదర్ గుడ్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ నేరెళ్ల శంకర్ తో కలిసి ప్రత్యేకపూజ లు చేసిన నరేందర్ గౌడ్ శేఖర్ గౌడ్ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు ఈకార్యక్రమంలో పెద్దగోని శ్రీనివాస్ గౌడ్ ఎన్నుదుల సురేష్ చెన్నారెడ్డిగూడ శివస్వాముల గురు స్వామి రమేష్ కొంకణి మురళి అంతటి వేణుకార్ గౌడ్ నుకం జగదీశ్వర్ ముదిరాజ్ కొత్తపల్లి రిషి గౌడ్ భక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్నదాన ప్రసాదం స్వీకరించారు



## మంచాల మండల కులగణన వివరాలను గ్రామాల వారీగా వెల్లడించాలి

**ఎంపీడీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేసిన డా.బాలకోటి నాయక్, మహేంద్రభాగత్**

**మంచాల వెలుతురు అక్టోబర్ 12:**
మంచాల మండలం మండలంలోని మొత్తం జనాభా వివరాలతో పాటు ఇటీవల నిర్వహించిన కులగణనకు సంబంధించిన తాజా వివరాలను మండల స్థాయిలో గ్రామాల వారీగా కులాల వా రీగా వెల్లడించాలని కోరుతూ మంచాల మండల ఎంపీడీవో.కార్యాలయంలోఅధికారికి డా.బాల కోటి నాయక్ వినతిపత్రం అందజేశారుఈ సందర్భంగా డా.బాలకోటి నాయక్ మాట్లాడుతూమం డలంలోని ప్రతి గ్రామానికి సంబంధించిన తాజా జనాభా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారుముఖ్యంగా మండలంలోని మొత్తం జనాభా ఎంత.గ్రామాల వారీగా జనాభా ఎంత బీసీ,ఎస్సీ,ఎస్టీ ఓసీ వర్గాలతో పాటు మైనారిటీల జనాభా ఎంత అనే వివరాలను స్పష్టం గా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణనకు సంబంధించిన అధికారిక నివేదికలు అందుబాటులో ఉన్న గణాంకాలను ప్రజలకు తెలియజేయడం ద్వా రా సామాజిక న్యాయం సంక్షేమ పథకాల అమలు వివిధ వర్గాల అభివృద్ధికి ఉపయోగపడు తుందని ఆయన పేర్కొన్నారుకావున మంచాల మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన తాజా జనాభా, కులాలవారీ గణాంకాలను అధికారిక రికార్డుల ఆధారంగా అందించాలని అధి కారిని కోరారు

# మహిళలు, జర్నలిస్టుల నిర్బంధంపై ఆందోళన

**రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రజాస్వామిక శక్తుల ఐక్యవేదికకు పిలుపు**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12**
ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా కార్యకర్తలు, నిరసనకారులు, విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల పట్ల పోలీసులు, భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరును ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ (ఎఫ్‌సీడీ) తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకునే పౌరులపై బలప్రయోగం, బెదిరింపులు, ఆంక్షలు విధించడం ఆందోళనకరమని పేర్కొంది. భావప్రకటనా స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, స్వతంత్ర జర్నలిజాన్ని అధికారులు గౌరవించాలని స్పష్టం చేసింది. అక్టోబర్ 12న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఈ అంశాలపై చర్చించి పలు అభిప్రాయాలను వెల్లడించింది. అక్టోబర్ 11న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసుల చర్యలపై సమావేశం చర్చించింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో శాంతియుత నిరసనకారులను చట్టవిరుద్ధంగా నిర్బంధించరాదని, పౌరుల రాకపోకలకు, జర్నలిస్టులు, న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులు నిర్వహించేందుకు ఆటంకం కలిగించరాదని సుప్రీంకోర్టు ఆదేశించినట్లు ఎఫ్‌సీడీ పేర్కొంది. అయితే సాయంత్రం ఐదు గంటల నుంచి మహిళా కార్యకర్తలు సహా నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తొలగించి నిర్బంధించినట్లు వార్తలు వెలువడ్డాయని తెలిపింది. ఈ పరిణామాలు న్యాయస్థానం ఆదేశాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని, దీనిపై న్యాయపరమైన పరిశీలన అవసరమని అభిప్రాయపడింది. దేశంలో రాజ్యాంగ ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛలు, సంస్థాగత జవాబుదారీతనానికి ఎదురవుతున్న సవాళ్లపైనా సమావేశం చర్చించింది. గత 12 సంవత్సరాల్లో రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘనలకు సంబంధించిన ఘటనలను నమోదు చేసి, ఆధారాలను సేకరించి ప్రజల ముందుంచాలన్న మల్లేపల్లి లక్ష్మయ్య ప్రతిపాదనను పరిశీలించింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటు హక్కుల పరిరక్షణ అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి. తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరుతూ నిరసనలకు దిగుతున్న యువత ఆందోళనలను అర్థం చేసుకోవాలని, వారి అభిప్రాయాలను ఆలకించి ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని పరిరక్షించే ప్రయత్నాలకు సంఘీభావం ప్రకటించాలని సమావేశం పేర్కొంది. రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పౌర సమాజ సంస్థలు, విద్యార్థులు, మేధావులు, మహిళా సంఘాలు, కార్మికులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, ఇతర ప్రజాస్వామిక శక్తులను ఒక స్వతంత్ర వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎఫ్‌సీడీ అభిప్రాయపడింది. ప్రజల్లో అవగాహన కల్పించడం, హక్కుల ఉల్లంఘనలను నమోదు చేయడం, సమన్వయంతో ప్రజాస్వామ్య కార్యక్రమాలు చేపట్టడంపై చర్చించింది. రాజ్యాంగ పరిరక్షణ, పౌర స్వేచ్ఛలు, న్యాయం, సమానత్వం, జవాబుదారీతనం కోసం విస్తృతమైన, శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని ప్రకటించింది. ఎఫ్‌సీడీ సమావేశానికి కన్వీనర్ కె. రామచంద్ర మూర్తి, జస్టిస్ బి. సుధర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మల్లేపల్లి లక్ష్మయ్య, గుజ్జా బిక్షం, మాజీ సమాచార హక్కు కమిషనర్, సీనియర్ జర్నలిస్టు ఆర్. దిలీప్ రెడ్డి, తంకశాల అశోక్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.వి. రెడ్డి, ప్రొఫెసర్ వెంకటనారాయణ, తెలంగాణ విద్యావంతుల వేదికకు చెందిన నాగయ్య, సీనియర్ జర్నలిస్టు రహమాన్, దీప్తి బత్తిని, జే) అధ్యక్షుడు శంకర్ గౌడ్ శిగ్గ, వేణుగోపాల్ రెడ్డి, నల్గొండకు చెందిన దయాకర్ రెడ్డి, రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్‌కు చెందిన టి. వెంకటేశం, రిటైర్డ్ న్యాయమూర్తి శ్రీ కంఠయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు హాజరయ్యారు జపాన్ ప్రతినిధి బృందానికి జీహెచ్ఎంసీ ఆతిథ్యం

**హైదరాబాద్--మియోషి సిస్టర్ సిటీ భాగస్వామ్యం 20వ వార్షికోత్సవం**
హైదరాబాద్--మియోషి సిస్టర్ సిటీ భాగస్వామ్యంతో సంబంధం ఉన్న జపాన్ ప్రతినిధి బృందం ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్. వి. కర్ణన్, ఐఏఎస్, అదనపు కమిషనర్ (ఆర్థిక) శ్రీమతి రాధికా గుప్తా, అదనపు కమిషనర్ (పారిశుధ్యం మరియు ఆరోగ్యం) శ్రీ ఎన్. రవి కిరణ్, మరియు ఇతర సీనియర్ అధికారులు ఈ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు.జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌లోని మియోషి నగరంతో హైదరాబాద్‌కు మధ్య 2006లో స్థాపించబడిన హైదరాబాద్--మియోషి సిస్టర్ సిటీ భాగస్వామ్యం యొక్క 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సమావేశం జరిగింది. వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన జపాన్ ప్రతినిధి బృందంలో హిరోషిమా ప్రిఫెక్చురల్ ప్రభుత్వ ప్రతినిధులు, వైస్ గవర్నర్ శ్రీ తోరు యోహిమాట్సు, శ్రీ కజువో ఇచికావా, శ్రీ హిరోయోషి ఫునైషి మరియు శ్రీ యోషిహిరో హరాజోనో ఉన్నారు. ఈ సమావేశంలో, జీహెచ్ఎంసీ అధికారులు నగర అభివృద్ధి దార్శనికతను మరియు కీలక కార్యక్రమాలను వివరిస్తూ, క్యూర్ రీజియన్, విజన్ 2047 మరియు క్యూర్ చట్టం గురించి సందర్శక బృందానికి వివరించారు. ఇరుపక్షాలు పట్టణ సవాళ్లు, పరిపాలన మరియు పురపాలక సేవలపై తమ ఆలోచనలను పంచుకుంటూ, సంభావ్య పరిష్కారాలు మరియు అవకాశాలపై చర్చించారు. ఈ సోదర నగర భాగస్వామ్యం రెండు దశాబ్దాల స్నేహం మరియు సహకారానికి గుర్తుగా నిలుస్తున్న తరుణంలో, హైదరాబాద్ మరియు జపాన్ మధ్య సంస్థాగత సంబంధాలను బలోపేతం చేయడం మరియు సహకారాన్ని కొనసాగించడం యొక్క ప్రాముఖ్యతను పునరుద్ఘాటిస్తూ, ఈ సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసింది.

## జపాన్ ప్రతినిధి బృందానికి జీహెచ్ఎంసీ ఆతిథ్యం

**హైదరాబాద్--మియోషి సిస్టర్ సిటీ భాగస్వామ్యం 20వ వార్షికోత్సవం**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12**
హైదరాబాద్--మియోషి సిస్టర్ సిటీ భాగస్వామ్యంతో సంబంధం ఉన్న జపాన్ ప్రతినిధి బృందం ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్. వి. కర్ణన్, ఐఏఎస్, అదనపు కమిషనర్ (ఆర్థిక) శ్రీమతి రాధికా గుప్తా, అదనపు కమిషనర్ (పారిశుధ్యం మరియు ఆరోగ్యం) శ్రీ ఎన్. రవి కిరణ్, మరియు ఇతర సీనియర్ అధికారులు ఈ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌లోని మియోషి నగరంతో హైదరాబాద్‌కు మధ్య 2006లో స్థాపించబడిన హైదరాబాద్--మియోషి సిస్టర్ సిటీ భాగస్వామ్యం యొక్క 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సమావేశం జరిగింది. వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన జపాన్ ప్రతినిధి బృందంలో హిరోషిమా ప్రిఫెక్చురల్ ప్రభుత్వ ప్రతినిధులు, వైస్ గవర్నర్ శ్రీ తోరు యోహిమాట్సు, శ్రీ కజువో ఇచికావా, శ్రీ హిరోయోషి ఫునైషి మరియు శ్రీ యోషిహిరో హరాజోనో ఉన్నారు. ఈ సమావేశంలో, జీహెచ్ఎంసీ అధికారులు నగర అభివృద్ధి దార్శనికతను మరియు కీలక కార్యక్రమాలను వివరిస్తూ, క్యూర్ రీజియన్, విజన్ 2047 మరియు క్యూర్ చట్టం గురించి సందర్శక బృందానికి వివరించారు. ఇరుపక్షాలు పట్టణ సవాళ్లు, పరిపాలన మరియు పురపాలక సేవలపై తమ ఆలోచనలను పంచుకుంటూ, సంభావ్య పరిష్కారాలు మరియు అవకాశాలపై చర్చించారు. ఈ సోదర నగర భాగస్వామ్యం రెండు దశాబ్దాల స్నేహం మరియు సహకారానికి గుర్తుగా నిలుస్తున్న తరుణంలో, హైదరాబాద్ మరియు జపాన్ మధ్య సంస్థాగత సంబంధాలను బలోపేతం చేయడం మరియు సహకారాన్ని కొనసాగించడం యొక్క ప్రాముఖ్యతను పునరుద్ఘాటిస్తూ, ఈ సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసింది.

## సహజ వజ్రాభరణాల ‘జూరీ’ విస్తరణ ప్రణాళికలు

- ఏడాదిలో 25 కొత్త స్టోర్ల ఏర్పాటు లక్ష్యం
- మొదటి స్టోర్ ఈనెల 18న రాజ్ భవన్ రోడ్‌లో..
- ‘ఫ్రాంచైజ్ ఓన్డ్, కంపెనీ ఆపరేటెడ్’ మోడల్‌తో విస్తరణ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12**
నైపుణ్యం, పారదర్శకత, కస్టమర్ల నమ్మకానికి ప్రతీకగా నిలిచి సహజ ఆభరణాలకు ప్రసిద్ధి చెందిన ‘జూరీ’ దేశవ్యాప్తంగా తన కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమైంది. వచ్చే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 కొత్త స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వివరాలు తెలిపేందుకు మాదాపూర్‌లో ఉన్న డిస్ట్రిక్ట్ 150 బై క్వోరం హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూరీ వ్యవస్థాపకుడు మహేష్ చౌదరి మాట్లాడుతూ ఫ్యాక్టరీ స్థాయి నుంచి వినియోగదారులకు సేవలందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రాబోయే మూడు నెలల్లో హైదరాబాద్‌లో నాలుగు స్టోర్లను ప్రారంభించనున్నామని చెప్పారు. వీటిలో మొదటి స్టోర్ రాజ్ భవన్ రోడ్‌లో ఈనెల 18వ తేదీన ప్రారంభం కానుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు విస్తరిస్తున్న క్రమంలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తున్నామన్నారు. దీని ద్వారా ఆన్‌లైన్–ఆఫ్‌లైన్ సమగ్ర రిటైల్ సేవలు అందిస్తూ.. తమ రోజువారీ కలెక్షన్లను దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అందుబాటులోకి తేనున్నామన్నారు. ఆభరణాల తయారీలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉందన్నారు. ఆధునిక లైఫ్‌స్టైల్ డిజైన్లు, సర్టిఫైడ్ సహజ వజ్రాలు, అసలైన రత్నాలు, బీఐఎస్ హాల్‌మార్క్ 18, 14, 9 క్యారెట్ల కలిగిన నాణ్యమైన బంగారు ఆభరణాలు అందిస్తున్నామన్నారు. విభిన్న శైలులు, వివిధ సందర్భాలకు సరిపోయేలా ప్రత్యేకమైన కలెక్షన్లు కలవన్నారు. ఆభరణాలు చిరకాలం మన్నికగా ఉండేలా ఎలా తయారు చేయాలో తెలుసన్నారు. జూరీలోని ప్రతి డిజైన్ ఆ అనుభవంతోనే రూపుదిద్దుకుంటుందన్నారు. ఆభరణాల కొనుగోలు అనేది కేవలం అమ్మకాలపై కాకుండా విశ్వాసంపై ఆధారపడి ఉండాలని నమ్ముతున్నామన్నారు. కస్టమర్లు మా స్టోర్‌కు వచ్చిన సారే కాకుండా భవిష్యత్తులో కూడా సేవలు అందించడమే మా లక్ష్యమన్నారు.



## విద్యార్థుల ఉద్యమానికి, ఓటు హక్కుల పరిరక్షణ పోరాటానికి సంపూర్ణ మద్దతు

- డా. జితేందర్ రావు తనుగుల
- రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య బలోపేతం, సామాజిక న్యాయం కోసం దేశ ప్రజలంతా ఐక్యంగా నిలవాలి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12**
దేశంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల బలోపేతం, సామాజిక న్యాయం కోసం విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు చేస్తున్న పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టివైజెఎఫ్) అధ్యక్షుడు డా. జితేందర్ రావు తనుగుల విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు తమ హక్కులు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కోసం నిర్వహిస్తున్న ఉద్యమాలకు ప్రజలు సంఘీభావం ప్రకటించాలని ఆయన కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను విశ్వసించే విద్యార్థులతో పాటు ప్రజాస్వామ్య, సామాజిక న్యాయ భావజాలం కలిగిన యువత, మార్క్సిస్టు, కమ్యూనిస్టు భావజాలాన్ని అనుసరించే విద్యార్థులు, రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరుకునే ప్రజలందరూ శాంతియుత ఉద్యమాలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని డా. జితేందర్ రావు తనుగుల స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడుతున్నాయనే ఆందోళనల నేపథ్యంలో, ఓటు హక్కుల పరిరక్షణ కోసం సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సిజెపి) చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఓటర్ల జాబితాల సవరణ పారదర్శకంగా, చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా జరగాలని ఆయన కోరారు. అర్హులైన ఏ పౌరుడూ తన ఓటు హక్కును కోల్పోకుండా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పొరపాటున ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడితే, బాధితులకు అభ్యంతరాలు తెలిపేందుకు, తమ పేర్లను తిరిగి చేర్చుకునేందుకు చట్టబద్ధమైన అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.సర్ ప్రక్రియలో అవకతవకలు లేదా నిర్లక్ష్యం జరిగినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో సహా ఈ వ్యవహారానికి సంబంధించి వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించాలని, తప్పిదాలు నిర్ధారణ అయిన పక్షంలో చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాలు, ఓసీలు సహా అన్ని సామాజిక వర్గాల ప్రజలు విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు, అర్హులైన పౌరుల ఓటు హక్కుల పరిరక్షణకు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలు ఏ ఒక్క కులానికి, మతానికి లేదా రాజకీయ భావజాలానికి మాత్రమే పరిమితమైనవి కావని, దేశంలోని ప్రతి పౌరుడి హక్కులు, భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ఇవ్వడం, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం దేశ ప్రజలందరి బాధ్యత అని డా. జితేందర్ రావు తనుగుల పేర్కొన్నారు. సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం ఆధారంగా సమాజ నిర్మాణం జరగాలంటే ప్రజలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

## కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీకి ప్రతిష్ఠాత్మక జెసిఐ అక్రిడిటేషన్

**రోగి భద్రత, వైద్య నాణ్యత, క్లినికల్ ఫలితాల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు గుర్తింపు**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12**
కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ఆరోగ్య సేవల గుర్తింపు సంస్థలలో ఒకటైన జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జెసిఐ) నుంచి అక్రిడిటేషన్‌ను పొందింది. ఈ గుర్తింపుతో రోగి భద్రత, వైద్య నాణ్యత, క్లినికల్ ఎక్సలెన్స్ విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలను అందుకుంటున్న కొద్దిమంది ఆసుపత్రుల జాబితాలో కేర్ హాస్పిటల్స్ స్థానం సంపాదించింది. ఈ అక్రిడిటేషన్ ద్వారా రోగులకు అత్యున్నత భద్రతా ప్రమాణాలు, మెరుగైన చికిత్సా ఫలితాలు, సంక్రమణ నియంత్రణలో కట్టుదిట్టమైన విధానాలు, మరియు ప్రపంచ స్థాయి ఉత్తమ వైద్య పద్ధతులకు అనుగుణంగా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుతున్నాయనే భరోసా లభిస్తుంది. ఆరోగ్య రంగంలో అత్యున్నత ప్రమాణంగా పరిగణించబడే జెసిఐ, రోగి సంరక్షణ, క్లినికల్ ప్రోటోకాల్స్, ఔషధాల నిర్వహణ, నాణ్యతా పరిపాలన, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్, రోగి భద్రత వంటి కీలక అంశాలపై కఠినమైన అంతర్జాతీయ ప్రమాణాల ఆధారంగా ఆసుపత్రులను మూల్యాంకనం చేస్తుంది. ఆసుపత్రి క్లినికల్ మరియు ఆపరేషనల్ విధానాలపై సమగ్ర సమీక్ష అనంతరం ఈ గుర్తింపు లభించింది. నాణ్యత, భద్రత, నిరంతర మెరుగుదలలను ప్రతి రోగి సేవలో భాగంగా నిలబెట్టేందుకు వైద్యులు, నర్సులు, కేర్‌గివర్లు, సపోర్ట్ సిబ్బంది చేసిన సమిష్టి కృషికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ సీఈఓ డా. పవన్ కుమార్ మాట్లాడుతూ “రోగులు తమ జీవితంలో అత్యంత కీలకమైన సందర్భాల్లో మాపై విశ్వాసం ఉంచుతారు. కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీలో ప్రతి రోగి సేవ వెనుక ఉన్న వ్యవస్థలు, ప్రక్రియలు, నాణ్యతా సంస్కృతి ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని జెసిఐ అక్రిడిటేషన్ నిర్ధారిస్తోంది. అంతేకాకుండా, నిరంతర మెరుగుదల, ఆవిష్కరణలు, అత్యున్నత వైద్య సేవల అందించడంపై మా నిబద్ధతకు ఇది గుర్తింపు. భారతదేశంలోని ప్రముఖ ఆరోగ్య సేవల నెట్‌వర్క్‌లలో ఒకటిగా, క్లినికల్ ఎక్సలెన్స్, రోగి-కేంద్రిత సేవలు, మెరుగైన వైద్య ఫలితాల ద్వారా విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంపై మా దృష్టి కొనసాగుతుంది” అని అన్నారు. నీలేష్ గుప్తా, రీజినల్ సీఈఓ, కేర్ హాస్పిటల్స్ మాట్లాడుతూ “ఈ విజయానికి మా వైద్యులు, నర్సులు, క్లినికల్ బృందాలు, సపోర్ట్ సిబ్బంది ఎన్నో సంవత్సరాలుగా చూపిన అంకితభావం, సమిష్టి కృషి కారణం. జెసిఐ అక్రిడిటేషన్ అనేది కేవలం మా ప్రక్రియలకు లభించిన గుర్తింపు మాత్రమే కాదు; ప్రతి రోజు సురక్షితమైన, సానుభూతితో కూడిన, ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించాలనే మా బృందం నిబద్ధతకు ప్రతిబింబం”అని పేర్కొన్నారు. ఈ మైలురాయి ద్వారా కేర్ హాస్పిటల్స్ అధునాతన ఆరోగ్య సేవల కోసం విశ్వసనీయ కేంద్రంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. అలాగే దేశంలోనే అత్యంత విశ్వసనీయ ఆరోగ్య సేవల నెట్‌వర్క్‌ను నిర్మించే దిశగా మరో కీలక అడుగు వేసింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని, కేర్ హాస్పిటల్స్ క్లినికల్ ఎక్సలెన్స్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడం, రోగుల అనుభవాన్ని మెరుగుపరచడం, సురక్షితమైన, విశ్వసనీయమైన, నాణ్యమైన ఆరోగ్య సేవలను సమాజానికి అందుబాటులో ఉంచడం పట్ల తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటిస్తోంది.

## ఘనంగా ఆర్ఎంపి- పిఎంపి గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం




**యాచారం వెలుతురు అక్టోబర్ 12:**
యాచారం మండలం మాల్ గ్రామంలో ఆత్మీయంగా కలుసుకున్న మూడు మండలాల గ్రామీణ వైద్యులు.దసరాపండుగ సందర్భంగా సోదరభావంతో వేడుకలు దసరాపండుగ శుభ సందర్భం గా మాల్ గ్రామంలోని నూతన యాజమాన్యానికి చెందిన పద్మావతి హాస్పిటల్ సహకారంతో ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్య క్షులు డాక్టర్ ఉక్కుల అశోక్ ఆధ్వర్యంలో ఆర్.ఎంపి-- పిఎంపి గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మే ళనం అలయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు ఈకార్యక్రమా నికి ముఖ్య అతిథులు వివిధ మండలాల నాయకులు గ్రామీణ వైద్యులు హాజరై పరస్పరం ఆ త్మీయంగా పలకరించు కుంటూ దసరాపండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు గ్రామీణ వై ద్యుల మధ్య ఐక్యత సోదర భావం పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ఈ కార్యక్రమంలో యాచారం మండల అధ్య క్షులు డాక్టర్ మంద మహేందర్ మాడుగుల మండల అధ్యక్షుడు విజయ్ చింతపల్లి మండల అ ధ్యక్షులు సైదులు మాడుగుల మాజీ అధ్యక్షులు డాక్టర్ భాస్కర్‌తో పాటు మూడు మండలాల కార్యదర్శులు ఆర్.ఎం.పి-- పిఎంపి గ్రామీణ వైద్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు ప్రత్యేక ఫంక్షన్ ఏర్పాటు చేసిన పద్మావతి హాస్పిటల్ యాజమాన్యం ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన గ్రామీ ణ వైద్యుల కోసం ప్రత్యేకంగా ఫంక్షన్ ఏర్పాటు చేశారు. ఈ విందును స్పాన్సర్ చేసిన పద్మావతి హాస్పిటల్ నూతన యాజమాన్య ప్రతినిధులు మహేశ్వర్ రెడ్డి కళ్యాణ్ కుమార్ సందీప్ రెడ్డిఆర్ ఎంపి--పిఎంపి వైద్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈసందర్భంగా పద్మావతి హాస్పిటల్ యాజమాన్యానికి తమవంతు సహకారం అండదండలు అందిస్తామని గ్రామీణ వైద్యులు హామీ ఇచ్చారు. వైద్య రంగంలో పరస్పర సహకారంతో ముందుకు సాగుతూఆత్మీయ సంబంధాలను కొనసాగించుకోవాలని అభిప్రాయ పడ్డారు ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు విప్ వెంకటేష్ కృష్ణ నాయక్ భిక్షపతి ప్రొద్దుటూరు రవీందర్ సరికొండ వెంకటేష్ నాగిళ్ల వెంకటేష్ శ్రీనివాస్ చారి పగడాల వెంకటేష్, ఎస్.ఎస్ చారి రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు



## పాఠశాల ఉపాధ్యాయ పరిరక్షణ చట్టం తీసుకురావాలి

**హైదరాబాద్ : అక్టోబర్ 12 ( వెలుతురు )**
పాఠశాలల నిర్వహణలో కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న బెదిరింపులు, అక్రమ జోక్యాలు, విధులకు ఆటంకాలు నివారించేందుకు ప్రత్యేకంగా ‘పాఠశాల ఉపాధ్యాయ పరిరక్షణ చట్టం’ తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి యునైటెడ్ స్కూల్స్ ప్రొటెక్షన్ ఫోరం (యూఎస్పీఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం లక్డీకాపూల్ లోని స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ కార్యాలయంలో కమీషనర్ నవీన్ నికోలస్ ను ఫోరం అధ్యక్షుడు బి. విజేందర్ రెడ్డి నేతృత్వంలోని బృందం వినతి పత్రం అందచేసి పలు అంశాలపై కమీషనర్ తో చర్చించారు. ఈ సందర్భంగా విజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ ) వర్తింపుపై స్పష్టత ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. పాఠశాలల అనుమతుల ప్రక్రియలో కరస్పాండెంట్లు మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు , సచివాలయం తదితర కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. అన్ని దశలు పూర్తయిన తర్వాత చిన్నపాటి డాక్యుమెంటేషన్ లోపాలు గుర్తించినా, దరఖాస్తు ఫైళ్లను తిరిగి మొదటి స్థాయికి పంపడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోందని కమీషనర్ దృష్టికి తీసుకవెళ్లినట్లు ఫోరం అధ్యక్షుడు విజేందర్ రెడ్డి వెల్లడించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కమీషనర్ హామీ ఇచ్చారని ఫోరం అధ్యక్షుడు విజేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమోతి , గడ్డం సాయి , సోహెల్ , సందీప్ లక్ష్మీ , దేవమ్మ , కవిత , వెంకన్న, కల్పన చారి తదితరులు పాల్గొన్నారు



# ఎల్ నినో కంటే ఎల్ కాంగో డేంజర్

- రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఓడించాలి
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**కొందుర్గు, వెలుతురు అక్టోబర్ 12 :** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎండిపోతున్న పంటలు, విద్యుత్ కోతలు, ఎరువుల కొరత తదితర అంశాలపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని జి.ఎం. పటేల్ మినీ గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాల కొరత, విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన ఉపశమన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తెలంగాణ నదీ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమకారుల పట్ల, తెలంగాణ జాతిపితగా తాము భావించే కేసీఆర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, మరోవైపు బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేసి, దుస్తులు విప్పించి జైలుకు పంపించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో పోలీసుల వ్యవహారశైలిపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు పెరిగాయని, ప్రజలు ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టాలని, పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎండిన పంటలను పరిశీలించి రైతులకు పరిహారం అందించాలి. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల కొరత, విద్యుత్ కోతలు, ఎల్‌నినో ప్రభావం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబంధు పథకం అమలుపైనా విమర్శలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను సందర్శించి, ఎండిపోయిన పంటలను పరిశీలించి, నష్ట వివరాలతో నివేదికలు రూపొందించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని అంజయ్య యాదవ్ విమర్శించారు. ప్రభుత్వం మిగిలిన కాలంలోనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.

## ఏసీబీ వలలో
# తహసీల్దార్, సర్వేయర్

**రంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 12 :** అవినీతికి అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వ అధికారులే లంచాల బాట పట్టడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అక్రమార్కులపై నిఘా పెంచి, వరుస దాడులు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు అధికారుల తీరు మారడం లేదు. తాజాగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో భారీ లంచం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హెచ్ఎండీఏ పరిధిలోని ఓ లేఅవుట్ క్లియరెన్స్‌కు సంబంధించి రూ.20 లక్షల లంచం తీసుకుంటున్న మండల సర్వేయర్ శ్రీనివాసులు, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుబడినట్లు సమాచారం.

**రూ.30 లక్షల డిమాండ్..**
**రూ.20 లక్షలకు ఒప్పందం**

అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని హెచ్ఎండీఏ లేఅవుట్ క్లియరెన్స్ వ్యవహారంలో సంబంధిత అధికారులు బాధితుడిని లంచం కోసం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తొలుత సుమారు రూ.30 లక్షలు అడిగి, చివరకు రూ.20 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం జరగాల్సిన పనికి భారీ మొత్తంలో లంచం అడగడంపై బాధితుడు ఏసీబీ



అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించి దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో లంచం సొమ్ము తీసుకుంటున్న సమయంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు నిబంధనల ప్రకారం జరగాల్సి ఉండగా, వాటిని పూర్తి చేసేందుకు లంచాలు డిమాండ్ చేసినట్లు తెలిపారు

## దుర్గామాత సేవలో
# కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్



- అమ్మవారికి శరవన్నవరాత్రులకు 10 పట్టు చీరలు, భారీ గజమాల, నైవేద్యాల సమర్పణ
- ధన్నసరి శ్రీ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు

**కేసముద్రం వెలుతురు అక్టోబర్ 12:** కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో కేసముద్రం మున్సిపాలిటీ ధన్నసరి 2వ డివిజన్ లో శ్రీ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాత అమ్మవారికి 10 పట్టు చీరలు, భారీ గజమాల, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నతనంలో ఆడుతూ, పాడుతూ పెరిగిన స్వగ్రామంపై తనకున్న మమకారాన్ని సమ్మయ్య గౌడ్ చాటుకున్నారు. జన్మభూమిలో గ్రామదేవతకు సేవ చేసుకునే అవకాశం లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అమ్మవారి పూజ కు విచ్చేసిన భక్తులతో, పెద్దలతో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్ లో తను ఆడి, పాడి పెరిగిన గ్రామానికి తనవంతు సహాయం తను బ్రతికినంత కాలం ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు... శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సావాల సందర్భంగా అమ్మవారికి 10 రోజులకు పట్టు వస్త్రాలు పెట్టి సేవ చేసే గొప్ప అవకాశం రావడం, ఈ సందర్భంగా మన వాళ్లందరిని కలిసే అవకాశాన్ని కల్పించే అవకాశం కల్పించిన కౌన్సిలర్ దారావత్ కిషోర్ కి,కమిటీ అధ్యక్షులు సురేష్ మరియు ప్రతీ కమిటీ బాధ్యుడికి కృతజ్ఞతలు తెలిపారు... ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ధారావత్ కిషోర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండా సురేష్, డైరెక్టర్ చి. యాదగిరి, ఉత్సవ కమిటీ సభ్యులు వేం అజిత్ రెడ్డి, వేం దిలీప్ రెడ్డి, అనుమునగంటి రాజు, కొసని శ్రీధర్ రెడ్డి, మర్రి నర్సింహా రెడ్డి, గోపాల మల్లారెడ్డి, పింగిలి మలయ్య, గాంతి మోహన్ రెడ్డి, గోపాల మన్మథ రెడ్డి, చింతనూర్ వెంకన్న, బంధరపు వెంకన్న,డా. వేణు గౌడ్,కొండా పాపారావు, కొండేటి సన్నీ, రేసు వెంకటేశ్వర్లు, కటకం శంకర్ లింగం, శీలం మునేష్, వేమూనూరి శ్రీను, గోపాల తిలక్, ఏనుగుల సుధీష్, రేసు సాయి, దుద్దిమెట్ల రాజు, గ్రామ ఆడపడుచులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

## మణిపూర్ బాధితుల కోసం గళమెత్తిన
# ఎంపీపై లైంగిక వేధింపుల కేసు

- విచారణ తీరుపై బిమోల్ అకోయిజమ్ అభ్యంతరాలు
- మేలో విద్యార్థినుల ఫిర్యాదులు.. అక్టోబర్‌లో ఉద్యోగం నుంచి తొలగింపు
- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్




**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 12 :** మణిపూర్‌లో మహిళలపై జరిగిన హింసను పార్లమెంటులో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోంచా బిమోల్ అకోయిజమ్ ఇప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో తనపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలతో వివాదంలో చిక్కుకున్నారు. అయితే, ఆరోపణలు వచ్చిన తీరు, విశ్వవిద్యాలయ అంతర్గత విచారణలో అనుసరించిన విధానం, అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసిన పరిణామాలపై ఆయన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తన వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా తనపై చర్యలు తీసుకున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. విద్యార్థినుల ఫిర్యాదులు 2026 మేలో జేఎన్‌యూ అంతర్గత కమిటీకి అందినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మే మొదటి వారంలో జరిగిన మౌఖిక పరీక్షల సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నది ఫిర్యాదుల్లోని ప్రధాన ఆరోపణగా పేర్కొంటున్నారు. మొత్తం 11 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేసినట్లు కొన్ని కథనాలు వెల్లడించాయి. ఈ ఆరోపణలను అకోయిజమ్ ఖండిస్తున్నారు. ఆరోపణలు చేసిన విద్యార్థినుల వాదనలతో పాటు, తన వివరణను, తన తరఫు సాక్షుల వాంగ్మూలాలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సి ఉందన్నది ఆయన అభ్యంతరం. విశ్వవిద్యాలయ అంతర్గత కమిటీ విచారణ అనంతరం అక్టోబర్ 9న అకోయిజమ్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ జేఎన్‌యూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, విచారణ ప్రక్రియలో తనకు సహకరించే అవకాశం ఇవ్వలేదన్న విశ్వవిద్యాలయ వాదనను ఆయన తోసిపుచ్చారు. తన తరఫు సాక్షులు 2026 ఆగస్టు 14న వాంగ్మూలాలు ఇచ్చారని, విచారణ కమిటీ నుంచి వచ్చిన 43 ఈ-మెయిళ్లకు తాను సమాధానాలు ఇచ్చానని ఆయన వెల్లడించారు. తన వివరణను, సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఈ అంశాలపై విశ్వవిద్యాలయ యాజమాన్యం, ఎంపీ వాదనలు పరస్పరం భిన్నంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, అక్టోబర్ 11న జేఎన్‌యూ ప్రధాన భద్రతాధికారి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 75, 75(1)(ఐ), 75(1)(ఐఐ), 79 కింద కేసు నమోదైనట్లు పోలీసు వర్గాలను ఉటంకిస్తూ వార్తా కథనాలు పేర్కొన్నాయి. విద్యార్థినుల ఫిర్యాదులు మేలో విశ్వవిద్యాలయ అంతర్గత కమిటీకి అందినట్లు చెబుతుండగా, పోలీసులకు ఫిర్యాదు అక్టోబర్ 11న అందింది. ఈ రెండు దశల మధ్య జరిగిన ప్రక్రియ, ప్రధాన భద్రతాధికారి ఫిర్యాదులో పొందుపరిచిన వివరాలు, దాని ఆధారాలు ఏమిటన్న అంశాలు ప్రజలకు స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉంది. ప్రధాన భద్రతాధికారి ఫిర్యాదు చేయడం ఒక్కటే ఆరోపణలు నిజమని నిర్ధారించదు. అదే సమయంలో, ఫిర్యాదు ఆలస్యంగా నమోదైందనే కారణంతో ఆరోపణలు నిరాధారమని కూడా తేల్చలేం. విద్యార్థినుల అసలు ఫిర్యాదులు, అంతర్గత కమిటీ నివేదిక, సాక్షుల వాంగ్మూలాలు, పోలీసులకు సమర్పించిన పత్రాలు పరిశీలించినప్పుడే ఈ వ్యవహారంలోని వాస్తవాలు స్పష్టమవుతాయి. ఫిర్యాదు చేసిన అధికారి ఏ ఆధారాలను పోలీసులకు అందించారు? విశ్వవిద్యాలయ అంతర్గత విచారణలోని ఏ అంశాలను ఎఫ్ఐఆర్‌కు ఆధారంగా తీసుకున్నారు? ఎంపీ అభ్యంతరాలకు విశ్వవిద్యాలయ యాజమాన్యం ఏమి సమాధానం చెబుతోంది? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. అకోయిజమ్ తనపై జరిగిన చర్యలను అన్యాయంగా అభివర్ణిస్తూ, విశ్వవిద్యాలయ ఉపకులపతి తన విచారణ సహకారానికి సంబంధించిన వివరాలపై తప్పుడు ప్రకటనలు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటానని కూడా తెలిపారు. ఆయన చేసిన ఆరోపణలపై విశ్వవిద్యాలయ యాజమాన్యం వాదనను, అందుబాటులో ఉన్న విచారణ రికార్డులను కూడా పరిశీలించడం అవసరం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తన వాదనను వినిపించే హక్కును కాపాడుతూనే, ఫిర్యాదుదారుల ఆరోపణలను నిష్పక్షపాతంగా విచారించడం న్యాయవ్యవస్థ బాధ్యత. మణిపూర్‌లో మహిళలపై హింసకు వ్యతిరేకంగా పార్లమెంటులో మాట్లాడిన ఎంపీ ఇప్పుడు మహిళల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎదుర్కొంటుండటం రాజకీయంగా చర్చకు దారితీసింది. అయితే, ఆయన పార్లమెంటులో లేవనెత్తిన అంశాలకు, ప్రస్తుత కేసుకు మధ్య సంబంధం ఉందని నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు బహిర్గతం కాలేదు. రాజకీయ విమర్శలకు అతీతంగా, ఈ కేసులోని వాస్తవాలు, విచారణ విధానం, చట్టపరమైన ప్రక్రియ పారదర్శకంగా వెలుగులోకి రావడం అవసరం. ఆరోపణలను తుది తీర్పుగా పరిగణించకుండా, సంబంధిత పత్రాలు, సాక్ష్యాలు, ఇరుపక్షాల వాదనల ఆధారంగా న్యాయం జరగాలి.

## కరవుతో రైతులు అల్లాడుతుంటే..
# కేబినెట్ రద్దుచేసి ఢిల్లీకి పారిపోయిన రేవంత్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శలు
- మోదీ 25 ఏళ్ల ప్రజాసేవపై తెలంగాణ బీజేపీ అభినందన తీర్మానం
- ఓట్ల తొలగింపుపై పొన్నం ప్రభాకర్‌కు బహిరంగ సవాల్
- ఆరు గ్యారెంటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు

**హైదరాబాద్, అక్టోబర్ 12**
రాష్ట్రంలో కరవు పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, అత్యవసర కేబినెట్ సమావేశాన్ని రద్దు చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఢిల్లీకి వెళ్లడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ అంశాలపై దృష్టి సారించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ బీజేపీ తరఫున అభినందన తీర్మానం ఆమోదించినట్లు రాంచందర్ రావు తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా మోదీ అందించిన సేవలను ఆయన ప్రశంసించారు.



2014కు ముందు దేశంలో అవినీతి, కుంభకోణాలు పెరిగాయని విమర్శిస్తూ, మోదీ నాయకత్వంలో సంక్షేమ పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం రూ.13 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, జాతీయ రహదారులు తదితర ప్రాజెక్టులకు సహకరిస్తోందని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్‌తో పాటు వికసిత తెలంగాణ సాధించాలంటే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని అభిప్రాయపడ్డారు.

**ఓట్ల తొలగింపుపై పొన్నానికి సవాల్**

ఓట్ల తొలగింపుపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు రాంచందర్ రావు ప్రకటించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపిస్తున్న వారు కనీసం పది మందిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయానికి తీసుకురావాలని కోరారు. తాను కూడా అక్కడికి వచ్చి రికార్డులను పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. నోటీసు, విచారణ ప్రక్రియ లేకుండా ఓటును తొలగించరాదని పేర్కొంటూ, అర్హులైన వారి ఓట్లు తొలగించినట్లు నిరూపిస్తే నిబంధనల ప్రకారం తిరిగి నమోదు చేయించాలని సూచించారు. ఆరోపణలు నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు. కరవు పరిస్థితులపై అక్టోబర్ 9న సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించినప్పటికీ, కేబినెట్ సమావేశాన్ని రద్దు చేసి ఢిల్లీకి వెళ్లడం సరికాదన్నారు. జూరాల, నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో కరవు తీవ్రతను పరిశీలించామని, ఆదిలాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శించానని తెలిపారు. రైతులకు ఫసల్ బీమా యోజన అమలు చేయాలని, రబీ పంటకు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోవాలో కాంగ్రెస్ యాత్ర సందర్భంగా రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను రాంచందర్ రావు తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ హిందూ సమాజం మనోభావాలను గౌరవించడం లేదని ఆరోపించారు. రామమందిర నిర్మాణం, ప్రాణప్రతిష్ఠ విషయంలో కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించారు. అయితే, ఈ అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ విమర్శల్లో భాగంగా చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా పెరుగుతున్నాయని ఆరోపించిన రాంచందర్ రావు, గంజాయి, కొకైన్, ఎండీఎంఏ వంటి మత్తుపదార్థాల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతంరావు, వీరేందర్ గౌడ్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌ఛార్జ్ ఎన్.వి. సుభాష్, అధికార ప్రతినిధి అభిషేక్ జిగిని తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే కరువు
# మండలాల ప్రకటన

### రబీలో ఆ పని చెయ్యొద్దు : రైతులకు అలెర్ట్!

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:** తెలంగాణా రాష్ట్ర రైతాంగానికి రైతు నేస్తం కారక్రమం ద్వారా ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల రైతులతో రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రులు రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రబీ సీజన్‌లో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నేడు హైదరాబాద్‌లో రైతు నేస్తం కార్యక్ర మంలో భాగంగా ఆయన, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లోని రైతులు, అధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తగ్గి నీటి లభ్యత గణనీయంగా తగ్గుతుందని హెచ్చరించారు. కాబట్టి



నీటిని పొదుపుగా వినియోగించాలని, బిందు సేద్యం ద్వారా పామ్ తోటలు, కూరగాయ లు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంట లను సాగు చేస్తే మంచిదని సలహా ఇచ్చారు. వరి వంటి నీటి అవసరం ఎక్కువైన పంటలు సాగు చేస్తే తాగునీటి సమస్య తీవ్రమవుతుందన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్ వంటి పనులు చేపట్టి జలవనరులను కాపాడుకోవాలని కోరారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా నమోదైందని, త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తామని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు రాకుం డా ఇప్పటి నుంచే నీటిని జాగ్రత్తగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటిక ప్పుడు గ్రౌండ్ వాటర్ లెవెల్ నివేదికలు అందిం చాలని ఆదేశిం చారు. ప్రభుత్వం రైతుల ప్రయో జనాలు, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుం టుందని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు ప్రభుత్వ సలహాలు పాటించి, నీటిని పొదుపుగా వినియోగిస్తే ఈ కష్టకాలం సులభంగా దాటవచ్చని ఆయన అన్నారు.

# ఖమ్మానికి కలియుగ వైకుంఠ శోభ

- శ్రీవారి ఆలయానికి వైభవంగా భూమిపూజ.. శంకుస్థాపన
- కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని చాటాలి: త్రిదండి చిన్నజీయర్ స్వామి
- ఖమ్మంలో శ్రీవారి ఆలయ సాకారానికి మంత్రి తుమ్మల కృషి కీలకం : టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు
- ఆలయ నిర్మాణానికి రూ.1.46 కోట్ల విరాళాల ప్రకటన





**ఖమ్మం, వెలుతురు అక్టోబరు 12:**

ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లేలా.. భక్తిభావ తరంగాలు వెల్లివిరిసేలా.. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యసన్నిధి ఖమ్మం గడ్డపై కొలువుదీరేందుకు తొలి అడుగు పడింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో నిర్మించనున్న శ్రీవారి ఆలయానికి సోమవారం వేద మంత్రోచ్ఛారణలు, హోమాలు, పూజా కార్యక్రమాల నడుమ వైభవంగా భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్ తదితరులు ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గోవింద నామ స్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరవశింపజేశారు. ఖమ్మం ప్రాంతానికి శ్రీవారి ఆలయం ఆధ్యాత్మిక శోభను తీసుకురావడమే కాకుండా.. ధర్మం, భక్తి, మానవత్వం, సమైక్యతకు ప్రతీకగా నిలవనుంది. కులమతాలకు అతీతంగా ప్రజలంతా ధర్మ మార్గంలో పయనిస్తూ, పరస్పర ప్రేమాభిమానాలతో జీవించాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి పిలుపునిచ్చారు. ప్రజలందరికీ శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహం కలగాలని ఆకాంక్షించారు.

### ఆశ్వయుజ సోమవారం.. దైవ సంకల్పానికి ప్రతీక

శంకుస్థాపన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో త్రిదండి చిన్నజీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. రెండు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో శుభప్రదమని పేర్కొన్నారు. ఆశ్వయుజ మాసంలోని సోమవారం నాడు ఆలయానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారు ఖమ్మం నగరానికి విచ్చేసేందుకు నేడు తొలి అడుగు పడిందని, ఈ పవిత్ర క్షేత్రం ద్వారా ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు లభిస్తాయని తెలిపారు.

### భాగస్వామ్యం నా పూర్వజన్మ సుకృతం: మంత్రి తుమ్మల

ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసిన త్రిదండి చిన్నజీయర్ స్వామికి, ఆలయ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు, టీటీడీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాముడి ఆశీస్సులతో



భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, ప్రస్తుతం అవి వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఇప్పుడు శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరగడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తయి ఖమ్మం ప్రాంతం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### తుమ్మల కృషితోనే ఆలయ నిర్మాణానికి శ్రీకారం

ఖమ్మంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ప్రధాన కారణమని టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు అన్నారు. చిన్నతనంలో విక్రమార్కుడి గురించి చదువుకున్నామని, ప్రస్తుతం మంత్రి తుమ్మల నాగేశ్వరరావులో అలాంటి వ్యక్తిత్వాన్ని చూస్తున్నామని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, రాబోయే ఏడాది కాలంలో ఐదు వేల ఆలయాలను నిర్మించాలనే ప్రణాళిక ఉందని వెల్లడించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ తర్వాత ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి అనుమతి లభించిందని, కరీంనగర్‌లోనూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. టీటీడీ నిబంధనల ప్రకారం స్థానిక ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధుల్లో 25 శాతాన్ని స్థానిక భక్తులు సమకూర్చాల్సి ఉంటుందని వివరించారు. ఖమ్మంలో సుమారు రూ.100 కోట్ల విలువైన భూమిని టీటీడీకి కేటాయించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### భక్తుల సహకారంతో శ్రీవారి ఆలయం త్వరితగతిన పూర్తి

టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్ మాట్లాడుతూ.. "వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన। వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥" అనే శ్లోకం శ్రీ వేంకటేశ్వర స్వామివారి మహిమను చాటుతుందని అన్నారు. టీటీడీ నమూనాలో శ్రీవారి ఆలయం ఖమ్మంలో నిర్మితం కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, త్రిదండి చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా భూమిపూజ జరగడం మరింత విశేషమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర రాజధానులతో పాటు ముఖ్యమైన పట్టణాల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టీటీడీ చర్యలు తీసుకుంటోందని వివరించారు. భక్తుల సహకారంతో ఖమ్మం ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, కొత్తగూడెం, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు,ప్రజాప్రతినిధి రాయల నాగేశ్వరరావు,కంబద్రిగుట్ట ఆలయ కమిటీ చైర్మన్, డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, విద్యుత్, రహదారులు-భవనాలు, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

### ఆలయ నిర్మాణానికి రూ.1.46 కోట్ల విరాళాలు

శ్రీవారి ఆలయ నిర్మాణానికి పలువురు ప్రజాప్రతినిధులు, దాతలు విరాళాలు ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించిన వివరాల ప్రకారం ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో భోజన ఏర్పాట్లు చేసిన వ్యక్తి కూడా ఆలయ నిర్మాణానికి అదనంగా రూ.11 లక్షలు విరాళంగా అందించారు. ఈ నాలుగు విరాళాల మొత్తం రూ.1.46 కోట్లు. విరాళాలు ప్రకటించిన దాతలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై భక్తి, విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ తమ వంతు విరాళాలు అందించి ఈ పవిత్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

## జలాల సంరక్షణ కోసం చివరి ఊపిరి వరకు కృషి సాగిస్తా

- శాశ్వత కరవు నివారణకు సమగ్ర వ్యూహం అవసరం
- ఎన్ డీఎంఏ మాజీ ఉపాధ్యక్షులు మర్రి శశిధర్ రెడ్డి




**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**

జలాల సంరక్షణ కోసం చివరి ఊపిరి వరకు తన కృషి కొనసాగుతుందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ మాజీ ఉపాధ్యక్షులు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న కరవును ఎదుర్కొనేందుకు తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. సోమవారం నాడు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 'చతుర్విధ జల ప్రక్రియ' (ఫోర్ వాటర్స్ కాన్సెప్ట్)ను అమలు చేయడం ద్వారా కరవు నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షపాతం లోటు, నీటి నిల్వల తగ్గుదలతో వ్యవసాయం దెబ్బతింటోందని తెలిపారు. గతంలోనూ వరుస కరువులు భూగర్భ జలాలను అడుగంటించి, గ్రామీణ ప్రజల జీవనోపాధిని దెబ్బతీశాయని పేర్కొన్నారు.

## "పొంగులేటి శీనన్న యువనేస్తం"

- ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువతకు, ఉచిత ఆన్‌లైన్ కోచింగ్..!
- నేటి నుండి రిజిస్ట్రేషన్లు ప్రారంభం



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు "పొంగులేటి శీనన్న యువనేస్తం" కార్యక్రమాన్ని ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా PSR ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, RC EXAMS భాగస్వామ్యంతో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను అందించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతీ యువకులు నేటి నుండి https://psryuvanestham.in/ పోర్టల్ లో తమ వివరాలను నమోదు చేసుకుని రిజిస్టర్ చేసుకోగలరు. రిజిస్టర్ చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగ ఆశావాహులకు, ఏడాది పాటు రూ.40 వేల విలువైన కోచింగ్‌ను ఆన్ లైన్‌లో ఉచితంగా అందించడం జరుగుతుంది. గ్రూప్ I, II, III, IV, ఎస్సై, కానిస్టేబుల్, పంచాయతీరాజ్, ఫారెస్ట్, రైల్వే, బ్యాంకింగ్, డీఎస్సీ వంటి వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా అన్ని సబ్జెక్టుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ అందించనున్నారు. ఉద్యోగం సాధించాలనే యువత ఆకాంక్షలకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# ఆరు వరుసల విస్తరణ కీలకం

- హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65 విస్తరణ పనులను వేగవంతం చేయాలి
- జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కోరిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- 2026 నవంబర్ 11 వరకు టెండర్ల దాఖలుకు గడువు
- 2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తామని చైర్మన్ హామీ



**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 12:**

హైదరాబాద్-విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి-65 విస్తరణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్‌తో పాటు సభ్యులు (ప్రాజెక్టులు) విప్నేష్ శర్మతో మంత్రి సమావేశమై ఈ కీలక ప్రాజెక్టుపై చర్చించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అత్యంత కీలకమైన ఈ జాతీయ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి విస్తరణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులను కోరారు.

### నాలుగు వరుసల నుంచి ఆరు వరుసలుం2 సర్వీసు రోడ్ల విస్తరణ

ప్రతిపాదిత ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల రహదారిని ఆరు వరుసలుగా విస్తరించడంతో పాటు, ఇరువైపులా సర్వీసు రోడ్లు, నియంత్రిత ప్రవేశ సౌకర్యాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ విస్తరణ పూర్తయితే వాహనాల రాకపోకలు సులభతరమవడంతో పాటు వాహనాల రద్దీ తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని వివరించారు.

### ప్రజల ప్రాణాల భద్రతే ప్రాధాన్యం

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వేలాది మంది ప్రయాణికులు, వాహనదారులకు నిత్యం కీలక రవాణా మార్గంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రమాదాలను తగ్గించి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా విస్తరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని స్పష్టం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేశారు.

### 2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తాం..

మంత్రి విజ్ఞప్తిపై స్పందించిన జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్, ఈ ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల దాఖలుకు 2026 నవంబర్ 11 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. 2027 జనవరి నాటికి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

## గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం

- మహాశక్తి ఆలయంలో వైభవంగా రెండో రోజు నవరాత్రి ఉత్సవాలు
- లింగార్చనలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్
- ఆలయానికి బారులు తీరిన వేలాది మంది భక్తులు



**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 12:**

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో గాయత్రీ దేవి (బ్రహ్మచారిణి) రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు చంద్రఘటంతో, గాజులతో అలంకరణతో అమ్మవారిని అలంకరించారు. వేలాది మంది భక్తులు ఈరోజు అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. వేదమాతగా, జ్ఞానప్రదాయినిగా, సకల చైతన్యానికి మూల శక్తిగా గాయత్రీదేవిని భక్తులు ఆరాధిస్తారు. అమ్మవారి ఈ రూపం జ్ఞానం, వివేకం, పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సుకు ప్రతీకగా నిలుస్తుంది. దసరా నవరాత్రుల్లో గాయత్రీదేవి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందించడంతో పాటు జ్ఞానానికి, ధర్మానికి ప్రాధాన్యమివ్వాలనే సందేశాన్ని గుర్తుచేస్తుంది.

### జ్ఞానమార్గంలో నడిపించే జగన్మాత

గాయత్రీదేవి ఆరాధన ద్వారా విద్య, వివేకం, ఏకాగ్రత, సత్ప్రవర్తన కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంపొందించుకోవడం, మంచి ఆలోచనలతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం ఈ ఆరాధనలోని ప్రధాన సందేశంగా భావిస్తారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి ఆలయంలో లింగార్చన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. పిండితో లింగాకారం ప్రతిష్టించి అభిషేకం చేశారు. దీపాలు వెలిగించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేశ్ సహా పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు అధ్యాత్మిక భావనతో ఆడుతూ పాడుతూ దాండియాలో పాల్గొనున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు ఆలయంలో అమ్మవారి సేవలోనే గడుపుతున్నారు. ఆద్యంతం దాండియా కార్యక్రమంలో పాల్గొంటున్నారు.



## దేశ వ్యతిరేక శక్తులతో కలిసి కుట్ర చేస్తున్నారు

**పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్**




**ఆంధ్రప్రదేశ్ వెలుతురు అక్టోబర్ 12:**

కేంద్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గారి రాజీనామా కోరటం ఉద్యమం చేయటం కేవలం ఒక సాకు మాత్రమేనని దీని వెనుక ప్రజాస్వామ్యబద్ధంగా దేశ ప్రజలు ఎన్నుకున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న కుట్ర దాగి ఉందని జరుగుతున్న పరిణామాలు ఒక్కొక్కటిగా విశ్లేషిస్తే అర్థమవుతుందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. గతంలో రాహుల్ గాంధీ గారు అరవింద్ కేజ్రీవాల్ గారు కపిల్ సింబల్ గారు ఇటువంటి నేతలందరూ చనిపోయిన ఓటర్ల ఓటర్ ఐడి కార్డుని తొలగించాలని, డూప్లికేట్ ఓటర్లను నివారించాలని కోర్టులు కెళ్ళి మరీ వాదించిన నేతలు ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం అదే పని చేస్తుంటే ఇదే నేతలు ఈరోజు తప్పుపట్టడం ఉద్యమం లేపటం ప్రజల్ని రెచ్చగొట్టడం అబద్ధాలు చెప్పటం దీనికి దేశం వెలుపల నుంచి మద్దతు రావటం అంతా ఒక ప్రణాళిక బద్ధంగా జరుగుతోందని దేశ ప్రజలు గమనించాలని రవికిరణ్ అన్నారు.

## తెలంగాణకు పతకాల పంట

**ఔరంగాబాద్, వెలుతురు అక్టోబర్ 12:**

తెలంగాణ ఎయిర్‌గన్ అసోసియేషన్ తరఫున ఔరంగాబాద్‌లో 11 అక్టోబర్ 2026న జరిగిన 13వ నేషనల్ రైఫిల్ అండ్ పిస్టల్ ఛాంపియన్‌షిప్, 14వ నేషనల్ స్లింగ్‌షాట్ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొన్న క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలను సాధించారు. జాతీయ స్థాయిలో తమ నైపుణ్యాన్ని నిరూపించుకుని తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు.

**పతక విజేతలు :**

1. జి. కృతిక్ రెడ్డి - అండర్-17 విభాగం
స్లింగ్‌షాట్: బంగారు పతకం
ఎయిర్ రైఫిల్: కాంస్య పతకం
2. ఆర్. విహాన్ రెడ్డి - అండర్-14 విభాగం
స్లింగ్‌షాట్: కాంస్య పతకం
ఎయిర్ రైఫిల్: బంగారు పతకం
3. ఎం. నరహరి - ఓపెన్ కేటగిరీ
ఎయిర్ రైఫిల్: కాంస్య పతకం
4. ఎం. శైలేంద్ర - మాస్టర్స్ కేటగిరీ
రైఫిల్: బంగారు పతకం



పిస్టల్: రజత పతకం

ఈ విజయాలు క్రీడాకారుల కృషి, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవడానికి డా. భువనేశ్వరి మేడమ్ తెలంగాణ ఎయిర్గన్ స్టేట్ సెక్రటరీ అందించిన ప్రోత్సాహం, సహకారం ఎంతో తోడ్పడ్డాయి. ఆమె అందించిన మద్దతుతో క్రీడాకారులు జాతీయ వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించగలిగారు. అదేవిధంగా, మీసాల శైలేంద్ర అత్యుత్తమ శిక్షణ, నిరంతర మార్గదర్శకత్వం, క్రమబద్ధమైన సాధన ఈ విజయాల్లో కీలక పాత్ర పోషించాయి. క్రీడాకారుల నైపుణ్యాన్ని మెరుగుపరచడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయం.

# వెదురు వస్తువులకు లక్ష గిరాకీ..
# సీతాఫలాలకు పోటాపోటీ..



## ఆరవ రోజు అదుర్స్ అనిపించిన సరస్ మేళా

హైదరాబాద్‌లోని ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న సరస్ మేళా ఆరవ రోజు సందర్శకులతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విదేశీయులు, పలువురు ప్రముఖులు మేళాను సందర్శించి వివిధ స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. ఎమ్మెల్సీ వాణిదేవి సైతం సరస్ మేళాలోని స్టాళ్లను సందర్శించి మహిళా సంఘాల ఉత్పత్తులను పరిశీలించారు.

- విదేశీయులు, ప్రముఖుల సందర్శనతో సందడి
- కాశ్మీర్ కార్పెట్ల నుంచి కేరళ మసాలాల వరకు భారీ గిరాకీ
- వెదురు ఉత్పత్తుల విక్రయాలతో ఒకే రోజు రూ.లక్ష ఆదాయం
- సీతాఫలాలకు పోటెత్తిన సందర్శకులు
- మహిళా సాధికారత, గ్రామీణ ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంలో ప్రత్యేక ఆకర్షణగా సరస్

హైదరాబాద్, వెలుతురు:

కాశ్మీర్ ప్రత్యేకతను చాటే కార్పెట్ల నుంచి కేరళకు చెందిన సుగంధ ద్రవ్యాల వరకు అనేక రకాల ఉత్పత్తుల కు కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. హస్తకళలు, గృహోపకరణాలు, సంప్రదాయ వస్తువులు, ఆహార ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు ఇలా విభిన్న ఉత్పత్తు లు ఒకే చోట అందుబాటులో ఉండటంతో సందర్శకులు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. మేళాలో విక్రయాలు ఆశాజనకంగా ఉండటంతో స్టాళ్ల నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ ఉత్పత్తులకు నగర వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటం తో పాటు, కొత్త మార్కెట్‌ను పరిచయం చేసుకునే అవకాశం కలుగుతోందని మహిళా వ్యాపారవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### మహిళల్లో చదువుపై అవగాహనకు ప్రత్యేక స్టాల్

మహిళా సాధికారతకు ఆర్థిక స్వావలంబనతో పాటు విద్య కూడా కీలకమనే సందేశాన్ని అందించేందుకు సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సంయుక్తంగా ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశాయి. వివిధ కారణాలతో చదువును మధ్యలోనే నిలిపివేసిన మహిళలు తిరిగి విద్యను కొనసాగించేలా ప్రోత్సహించడం ఈ స్టాల్ ముఖ్య ఉద్దేశం.చదువు ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, చదువును కొనసాగించాలనే ఆసక్తి ఉన్న మహిళలకు అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అమ్మకు అక్షరమాలలో మహిళలను నమోదు చేస్తూ, వారు తిరిగి చదువుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నారు. విద్య ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు కుటుంబ,సామాజిక జీవితాల్లో చురుకైన పాత్ర పోషించేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యం.



### ప్రత్యేక ఆకర్షణగా ఇందిరా మహిళా శక్తి చీర

మేళా ప్రాంగణంలో తెలంగాణ చేనేత, వస్త్ర సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తున్న ఇందిరా మహిళా శక్తి చీర సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఏడాది డిజైన్‌కు సంబంధించిన ప్రత్యేక చీరను తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ (TGSCO) ఆధ్వర్యంలో ప్రదర్శనకు ఉంచారు. మహిళా సాధికారతను ప్రతిబింబించే ఈ చీరను సందర్శకులు ఆసక్తిగా పరిశీలించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సంప్రదాయ వస్త్రకళలకు ప్రోత్సాహం వంటి అంశాలను ఈ ప్రదర్శన చాటిచెబుతోంది.




### సీతాఫలాలకు పోటెత్తిన సందర్శకులు

నారాయణపేట ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీతాఫల్ స్టాల్ ప్రారంభం కావడంతో మేళాలో మరో ప్రత్యేక ఆకర్షణ చేరింది. స్థానికంగా లభించే సీతాఫలాలను విక్రయానికి ఉంచగా సందర్శకులు పెద్ద సంఖ్యలో కొనుగోళ్లకు ముందుకొచ్చారు. కిలో సీతాఫలాలను కేవలం రూ.100కే అందిస్తుండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు సందర్శకులు ఆసక్తి చూపారు. సీతాఫలాలతో పాటు వాటి గుజ్జును కూడా విక్రయానికి ఉంచడం విశేషంగా నిలిచింది. పావు కిలో సీతాఫలం గుజ్జును రూ.75కు అందిస్తుండటంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా పండ్లతో పాటు వాటి విలువ ఆధారిత ఉత్పత్తులను కూడా నేరుగా వినియోగదారులకు పరిచయం చేయడం వల్ల రైతులకు మార్కెట్ అవకాశాలు విస్తరిస్తున్నాయి.



### ఒకే రోజు రూ.లక్ష విలువైన వెదురు ఉత్పత్తుల విక్రయాలు

మణిపూర్‌కు చెందిన మహిళా సంఘం ఏర్పాటు చేసిన వెదురు ఉత్పత్తుల స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. వెదురుతో రూపొందించిన అందమైన, ఉపయోగకరమైన వస్తువులకు మంచి గిరాకీ లభిస్తోంది. ఒక్క రోజులోనే సుమారు రూ.లక్ష విలువైన వెదురు ఉత్పత్తులను విక్రయించినట్లు ఆ స్టాల్ నిర్వాహకురాలు తెలిపారు. గ్రామీణ మహిళలు తమ సంప్రదాయ నైపుణ్యంతో తయారుచేసిన ఉత్పత్తులకు సరైన మార్కెట్ లభిస్తే ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని ఈ విక్రయాలు చాటిచెబుతున్నాయి.

### స్టాళ్ల నిర్వాహకులకు సెర్ప్ సిబ్బంది సహకారం

మేళాకు తరలివస్తున్న సందర్శకులకు, స్టాళ్ల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెర్ప్ సిబ్బంది అవసరమైన సహకారం అందిస్తున్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడం, కొనుగోలుదారులను ఆకర్షించడం, విక్రయాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామీణ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ కల్పిస్తూ, వారి నైపుణ్యాన్ని వ్యాపార అవకాశాలుగా మార్చేందుకు సరస్ మేళా వేదికగా నిలుస్తోంది. మహిళలు కేవలం ఉత్పత్తుల తయారీకే పరిమితం కాకుండా, మార్కెటింగ్, విక్రయాలు, వ్యాపార నిర్వహణలోనూ రాణించేలా ఈ మేళా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఆరవ రోజు కూడా విశేష స్పందనతో కొనసాగిన సరస్ మేళా గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలను అందిస్తూ ముందుకు సాగుతోంది.




## దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ
## వీధుల్లో పోరాటం చేస్తుండు

- ఆయనకు మద్దతుగా మనమందరం వీధుల్లోకి రావాల్సిందే..
- సంగారెడ్డిలో రాహుల్ గాంధీకి మద్దతుగా జరిగిన భారీ ర్యాలీలో స్పష్టం చేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 12:

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సోమవారం సంగారెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ చౌక్ వరకు సాగిన ర్యాలీలో నిర్మలా జగ్గారెడ్డితో పాటు వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. "జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి", "మోడీ డౌన్ డౌన్", "రాహుల్ గాంధీ జిందాబాద్" అంటూ ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. అంబేద్కర్ చౌక్‌కు చేరుకున్న అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, బీజేపీ దొంగ ఓట్లతో అధికారంలోకి వస్తోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారని, ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

"రాహుల్ గాంధీ ఢిల్లీ రోడ్లపై పోరాడుతుంటే మనం ఇళ్లలో విశ్రాంతి తీసుకోవడం సరైనదేనా? ఆయనకు మద్దతుగా మనమందరం వీధుల్లోకి రావాల్సిందే" అని అన్నారు. తాను ఢిల్లీ వెళ్లగలిగినప్పటికీ, రాహుల్ గాంధీ పోరాటానికి స్థానికంగా సంఘీభావం తెలియజేయాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలోనే ఉండి ర్యాలీ నిర్వహించినట్లు వివరించారు. ఓట్ల చోరీ జరుగుతోందని, బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. ఈ అంశాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కనీసం పది మందికి వివరించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోమని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆ డిమాండ్ నెరవేరే వరకు సంగారెడ్డిలోనూ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. "రాహుల్ గాంధీ రోడ్డుపై పడుకుని నిరసన తెలిపితే, మనం కూడా అదే విధంగా ఆయనకు మద్దతుగా నిలవాలి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



**బీజేపీ మాత్రమే గెలిచేలా**

## ఎన్నికల కమిషన్ అక్రమాలు

- ఓటు హక్కు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సత్యాగ్రహం
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మా పోరాటం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 12:

ప్రజాస్వామ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మాత్రమే గెలిచేందుకు అవకాశం ఉండేలా ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. దేశ పౌరుల ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పిలుపు మేరకు సోమవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యానికి పౌరుల ఓటు హక్కు అత్యంత బలమైన పునాది అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రాథమిక హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓటు హక్కుకు విఘాతం కలిగించే అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థలో బీజేపీ మాత్రమే గెలిచే పరిస్థితులు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గత కొంతకాలంగా దేశ ప్రజల దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. ఈ పోరాటం కాంగ్రెస్ పార్టీకి లేదా ఆ పార్టీ నాయకులకు సంబంధించిన ఓట్ల కోసం మాత్రమే కాదని, దేశంలోని ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం కోసమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### గాంధేయ మార్గంలో సత్యాగ్రహం

ఓటర్ల హక్కులకు సంబంధించిన సమస్యలను వివిధ రాజ్యాంగ సంస్థల దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ గతంలోనూ ప్రయత్నించిందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రపతిని కలిసి వినతులు సమర్పించడంతోపాటు సంబంధిత వ్యవస్థల దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మరో రాజ్యాంగ వ్యవస్థ దృష్టికి ఓటు హక్కుల పరిరక్షణ అంశాన్ని తీసుకెళ్లేందుకు ఢిల్లీలో శాంతియుతంగా, గాంధేయ మార్గంలో సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

### తెలంగాణ కాంగ్రెస్ నేతల భారీ భాగస్వామ్యం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో తెలంగాణ నుంచి మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ తదితర అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ఢిల్లీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు

- భక్తిశ్రద్ధలతో పాటలు పాడి బతుకమ్మల ఆడిన మహిళలు
- పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:

బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక అని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సంబరాల్లో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు. బంతి, చామంతి, గునుగు, తంగేడు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి,మహిళా ఉద్యోగులు, సిబ్బంది చుట్టూ చేరి "బతుకమ్మ బతుక మ్మ ఉయ్యాలో" అంటూ పాటలు పాడుతూ ఆడి పాడారు.తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. బతుకమ్మ వేడుకల్లో శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్. తిరుపతి, శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జపాన్‌లో ఉద్యోగాలకు యువతకు శిక్షణ

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12 :

జపాన్‌లోని అంతర్జాతీయ ఉద్యోగావకాశాలను తెలంగాణ యువత అందిపుచ్చుకునేలా నైపుణ్య శిక్షణ అందిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు.వచ్చే ఐదేళ్లలో 45 లక్షల మందికి శిక్షణ అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో నారా జపాన్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్ 2026కు 10వేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. ప్రస్తుతం తెలంగాణలో 169జపాన్ కంపెనీలు పని చేస్తున్నాయని, మరిన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టాలని మంత్రి కోరారు.తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(టామ్ కామ్) ద్వారా 16 దేశాల్లో 14,500కు పైగా ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, అధునాతన తయారీ రంగాల్లో జపాన్‌తో సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హిరోషిమా ప్రిఫెక్చర్ అసెంబ్లీ చైర్మన్ తకాషి నకమోటో, జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకహాషి, హిరోషిమా వైస్ గవర్నర్ తోరు యోషిమత్సు, మియోషి నగర డిప్యూటీ మేయర్ తెరువో యమజాకి, జె.క్లెయిర్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజుకి తకానో, హైదరాబాద్ జపనీస్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్.ఫురుటా, కిటోలిట్ రోబోటిక్స్ వ్యవస్థాపకుడు కశ్యప్ వరుణ్, నారా జపాన్ హబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బి.రామ భద్ర, సహ వ్యవస్థాపకుడు బి.నాగనాథ్ పాల్గొన్నారు. మియోషి పప్పెట్ షో, ఇకెబానా పుష్పాలంకరణ, జపనీస్ భాషా ప్రసంగ పోటీ, ఇండో - జపాన్ ఇన్నోవేషన్ హ్యాకథాన్ అవార్డులు, అనిమే, కాస్ ప్లే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com